
RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక







ప్రచురణ : తెలంగాణ, సంపుటి 02, సంచిక 60, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, మంగళవారం - 02 - జూన్ - 2026 , వెల రూ.5/-



### నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు..
## సీబీటీ పిటిషన్ తిరస్కరణ

ఢిల్లీ: నీట్ (యూజీ) 2026 రీ-టెస్టును కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. దీంతో, ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 21న ఓఎంఆర్ విధానంలోనే ఈ పరీక్ష జరగనుంది. ఈ మేరకు ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ దశలో పరీక్షా విధానాన్ని మార్చడం వల్ల తీవ్రమైన నిర్వహణాపరమైన సవాళ్లు ఎదురవుతాయని కోర్టు అభిప్రాయపడింది. సమయాభావం, ఎన్టీఏపై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. "ఇలాంటి అభ్యర్థనలను గతంలోనే తిరస్కరించాం. ఈ అంశాన్ని వెకేషన్ తర్వాత జులైలో విచారిస్తాం" అని జస్టిస్ నరసింహ స్పష్టం చేశారు. మే 3న జరిగిన నీట్ (యూజీ) 2026 పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో దాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. వాట్సాప్‌లో సర్క్యులేట్ అయిన 'గెస్ పేపర్'లోని సుమారు 120 ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోలడంతో ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరుగుతోంది. 22 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిర్ణయించారు. జూన్ 21న జరిగే రీ-టెస్ట్ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బహుళస్థాయి అథెంటికేషన్, పటిష్ఠ నిఘా వంటి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు, నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు 2027 నుంచి నీట్ (యూజీ)ని సీబీటీ విధానంలో నిర్వహించేందుకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఎన్టీఏ కోర్టుకు తెలిపింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో పరీక్ష విధానంపై విద్యార్థులకు స్పష్టత లభించింది.

### మే నెలలో తిరుమలకు పోటెత్తిన భక్తులు..
## శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయానికి మే నెలలో భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, విద్యాసంస్థలకు విరామం కావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో మే మాసంలో శ్రీవారి దర్శనాలు, హుండీ ఆదాయం, తలనీలాల సమర్పణలో కొత్త రికార్డులు నమోదైనట్లు టీటీడీ తాజాగా గణాంకాలను విడుదల చేసింది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మే నెలలో మొత్తం 25,46,168 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, భక్తుల రద్దీ తగ్గలేదు. రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా సర్వదర్శనం భక్తులు వేచి ఉండే కంపార్ట్‌మెంట్లలో నిరంతరాయంగా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు అందించి వారికి ఇబ్బంది కలగకుండా చూసింది. స్వామివారిపై తమకున్న భక్తిని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. మే నెలలో శ్రీవారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. ఒకే నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం తిరుమల చరిత్రలోనే అరుదు. నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా భక్తులు పెద్దఎత్తున సమర్పించారు. ఇక, మే నెలలో 12,29,773 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## రైతు డిస్కం పేరిట విద్యుత్తు ప్రైవేటీకరణకు కుట్ర: కె.కవిత

హైదరాబాద్: రాష్ట్రంలో రైతు డిస్కం ఏర్పాటు పేరుతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఆరు నెలలుగా రహస్యంగా ఉంచిన రైతు డిస్కం అంశాన్ని ఇప్పుడు బయటపెట్టడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతు డిస్కం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం' అని పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారి చేయి తొలగించిన ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, బాధిత చిన్నారి పేరుపై రూ.25 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దసరాలోపు ప్రారంభించాలని లేదంటే మరుసటి రోజు నుంచే పాదయాత్ర చేపడతామని కవిత హెచ్చరించారు.

## 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి: కేటీఆర్

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. క్లాసిక్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 25 నుండి సర్ ప్రారంభమవుతుందని.. సర్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేది. 65 సంవత్సరాలలో కాంగ్రెస్ చేయని పని ఆరు నెలల్లో కేసీఆర్ చేసి చూపించారు. 24 గంటల పాటు రైతులకు, పరిశ్రమలకు కేసీఆర్ నాణ్యమైన కరెంటు ఇచ్చారు" అని కేటీఆర్ గుర్తు చేశారు. "వ్యవసాయానికి రోజుకు మూడు గంటల కరెంటు ఇస్తే చాలు అన్నా రేవంత్ రెడ్డి.. ఇప్పుడేమో రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడు. 35 వేల ఓటర్లు డిఫెన్స్ ల్యాండ్‌లో ఇల్లు కట్టుకున్నారు. వారి ఓటు హక్కు ఉండాలంటే సర్‌లో నమోదు చేసుకోవాలి. హైదరాబాద్‌లో మొత్తం బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించారు. గ్రామాల్లో రేవంత్ 420 మోసపూరిత హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుంటే మనం నెత్తి మీద పెట్టుకున్నాం. ..సుమారు 2 లక్షల పట్టాలు కేసీఆర్ ఇచ్చారు.. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క ఇండ్ల పట్టాలు అయినా రేవంత్ ఇచ్చారా?. స్కూటీ లేదు లూటీ మాత్రం నడుస్తుంది. రైతుబంధు లేదు రాహుల్ బంధు నడుస్తుంది. రైతులకు యూరియా ఇచ్చే దిక్కు లేదు. ధాన్యం కొనే దిక్కు లేదు కానీ.. రైతులకు రైతు డిస్కం తెస్తారంటా?. రైతులకు ఊరి వేయడానికే రైతు డిస్కం తెస్తున్నారు. పశ్చిమ బెంగాల్ లో 95 లక్షల ఓట్లు సర్ పేరుతో తీసేశారు.. కోర్టుకు వెళ్లారు.. కోర్టులో ఉండగానే ఎన్నికలు జరిగాయి బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారు. అందరూ సర్‌లో పాల్గొని.. మన ఓట్లు తొలగించకుండా మనం అప్రమత్తంగా ఉండాలి" అని కేటీఆర్ సూచించారు.

### ఇరాన్ రాజకీయాల్లో కార్చిచ్చు: 'సైనిక తిరుగుబాటు' అంటూ
## అధ్యక్షుడు పెజెష్కియాన్ రాజీనామా

ఢిల్లీ: ఇరాన్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తన పదవికి అధికారికంగా రాజీనామా చేస్తూ.. దేశ సుప్రీం లీడర్ అయాతొల్లా మొజ్తబా ఖమేనీకి లేఖ సమర్పించడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. దేశంలో సైన్యం 'నిశ్శబ్ద తిరుగుబాటు' (ుబఅవ్ వీఅశ్రీఖ్షుతీఎ జశీబజూ న్ఫ్) కు పాల్పడిందని, ఎన్నికైన పౌర ప్రభుత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాలన్నింటినీ లాగేసుకుందని పేర్కొంటూ పెజెష్కియాన్ తన రాజీనామా లేఖలో బాంబు పేల్చారు. వివిధ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం.. ఇరాన్ ప్రభుత్వంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత పోరు ఈ నిర్ణయంతో క్లైమాక్స్‌కు చేరింది. దేశంలోని కీలకమైన, వ్యూహాత్మక నిర్ణయాలన్నింటి నుంచి తనను, తన మంత్రివర్గాన్ని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లు పూర్తిగా పక్కనబెట్టారని అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏర్పడిన ఈ అధికార శూన్యతను ఆసరాగా చేసుకుని, ఐఆర్‌జీసీలోని కఠినతరమైన హార్డ్‌లైనర్ గ్రూపులు దేశ పరిపాలనను తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని ఆయన ఆరోపించారు.

సైన్యం చర్యలపై తీవ్ర అసంతృప్తి

ఇటీవల పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో జరిగిన ఉద్రిక్తతలు, యూఏఈ పై జరిగిన డ్రోన్, క్షిపణి దాడుల వెనుక ఐఆర్‌జీసీ మిలిటరీ నాయకత్వమే ఉందని పెజెష్కియాన్ లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి కనీస సమాచారం కూడా లేకుండా సైన్యం ఇష్టారాజ్యంగా జరిపిన ఈ దాడులను ఆయన "కేవలం ఒక పిచ్చిచర్య (మీఱఎఅవం)" గా అభివర్ణించారు. బాధ్యతారాహిత్యమైన ఇటువంటి చర్యల వల్ల దేశం కోలుకోలేని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. "ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో, రాజ్యాంగం నాకు కల్పించిన కనీస బాధ్యతలను కూడా నేను నెరవేర్చలేకపోతున్నాను. అందుకే ఈ పీఠంపై కొనసాగడం అర్థరహితం" అని రాజీనామా లేఖలో పెజెష్కియాన్ పేర్కొన్నారు.

ఉత్కంఠలో టెహ్రాన్.. తదుపరి ఏంటి?

తన అధికారాలను సైన్యం క్రమంగా లాగేసుకోవడాన్ని నిరసిస్తూ.. పదవి నుంచి తప్పుకునే ముందే అధ్యక్షుడు పెజెష్కియాన్ ఈ విధంగా తిరుగుబాటు జెండా ఎగరేశారు. అమెరికా – ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఒక కొలిక్కి వస్తున్న తరుణంలో, ఇరాన్ దేశాధినేతే తిరుగుబాటు ఊహాగానాలను నిజం చేస్తూ తప్పుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ రాజీనామాను ఆమోదిస్తారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది.

## తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారు

హైదరాబాద్: హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

## "రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిచేందుకే రైతు డిస్కం

మొదటి పేజి తరువాయి

ఆ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారంటూ మండిపడ్డారు. "రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిచేందుకే రైతు డిస్కం. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని రైతు డిస్కమ్‌కు కనెక్ట్ చేస్తున్నాం. దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఎక్కడాలేని విధంగా రైతు డిస్కంను ఏర్పాటు చేశాం. రైతు డిస్కం ఏర్పాటుతో జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రభుత్వానికి అవసరాన్నిబట్టి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటు కలుగుతుంది. బీజేపీ, బీఆర్ఎస్ అబద్ధాల పునాదులపై పార్టీలను బతికించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి" అంటూ రేవంత్ దుయ్యబట్టారు. "కిషన్‌రెడ్డికి నేను ఒకటే చెప్పదలుచుకున్నా. వడ్లు కొనంది మీరు.. రైతు పండించిన ప్రతీ గింజను మా ప్రభుత్వం కొంటుంది. మేం కొంటున్నది ఎంత.. కేంద్రం కొనేది ఎంత?. కేంద్రం ఎంఎస్పీ నిర్ణయించింది కానీ ఒక్క గింజనైనా కొంటున్నారా?. వరి, జొన్న, మొక్కజొన్నలు మొత్తం మా ప్రభుత్వం కొంటుంది. మేం కొన్న మొత్తం పంట కేంద్రం కొనాలి. కేంద్రం కొనకపోవడం వల్లే రాష్ట్రంలో రైతు గోస పడుతున్నాడు. కేంద్రం కొనకపోతే బస్సులు వేసుకుని వెళ్లిన వాళ్ల దగ్గరికే ట్రాక్టర్లు వేసుకుని వెళతాం. జల వివాదాలను రాష్ట్రాలు సమన్వయంతో పరిష్కరించుకోవాలని మోదీ చెప్పారు. కానీ తుమ్మిడిహట్టి కోసం కలిసి మాట్లాడటానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ కోరినా స్పందించడంలేదు" అంటూ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర రైతాంగానికి 24 గంటలూ నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని, ఆ



పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎత్తేసేది లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన తమకు లేదని తేల్చిచెప్పారు. అసలు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన కేంద్రం ఎప్పుడూ పెట్టలేదని చెప్పిన రేవంత్.. ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్ల విషయంలో బీఆర్ఎస్‌కు సవాల్ చేశారు. ఉచిత విద్యుత్ ఎత్తేసినా, వ్యవసాయానికి మీటర్లు పెట్టినా వచ్చే ఎన్నికల్లో తాము పోటీ చేయబోమని, తాము అలా చేయకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా అని వ్యాఖ్యానించారు. శనివారం రేవంత్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. 'మేం అధికారంలోకి వచ్చేసరికి తెలంగాణలోని డిస్కంలు కుప్పకూలే పరిస్థితిలో ఉన్నాయి. డిస్కంలకు ఇప్పుడు రూ.69,745 కోట్ల అప్పులున్నాయి. అవి బాగుచేయలేనంతగా నిర్వీర్యమయ్యాయి. ఉచిత విద్యుత్ కింద రైతులకిచ్చే కరెంటుకు ఒక్క రూపాయి కూడా గత ప్రభుత్వం డిస్కంలకు చెల్లించలేదు. దీంతో డిస్కంలు అప్పులు చేసి బొగ్గు, విద్యుత్ కొనుగోలు చేసుకోవాల్సి వచ్చేది. ఉద్యోగుల నిర్లక్ష్యం, నిర్వహణా లోపాల కారణంగా ఇతర అవసరాలకు వినియోగించిన విద్యుత్‌ను కూడా ఉచిత విద్యుత్ లెక్కలో రాసేవాళ్లు. వాళ్లు కనీసం ఎప్పుడు ఎంత కరెంటు తీసుకోవాలనే అంచనాలు కూడా వేయలేదు. మేం అధికారంలోకి వచ్చాక డిస్కంలను దారిలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. అందులో భాగంగానే రైతులతో పాటు ప్రభుత్వం గంపగుత్తగా కరెంటును వినియోగించుకునే కేటగిరీని కలిపి ప్రత్యేకంగా రైతు డిస్కం ఏర్పాటు చేశాం. దీనిద్వారా ఎంత విద్యుత్ తీసుకున్నామో, ఎంత సరఫరా చేశామో, నిర్వహణ నష్టాలు ఎంతో, బిల్లులు ఎంత వస్తున్నాయో కచ్చితంగా లెక్క తేలుతుంది. తెలంగాణ రైతాంగం రాత్రిపూట పెద్దగా వ్యవసాయానికి విద్యుత్ వాడదు కాబట్టి ధర తక్కువ ఉన్నప్పుడు కొనుగోలు చేసి ఆ డిస్కం ద్వారా రైతులకు విద్యుత్ ఇస్తాం. అసలు మాకు ఉచిత విద్యుత్ ఎత్తేయాలనే ఆలోచనే లేదు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు కూడా పెట్టబోం. అలా పెట్టేది ఉంటే వచ్చే ఎన్నికల్లో మేం పోటీ చేయబోం. ఒకవేళ మేం పెట్టకపోయినా, ఉచిత విద్యుత్ ఎత్తేయకపోయినా బీఆర్ఎస్ పోటీ చేయకుండా ఉంటుందా? బీఆర్ఎస్ నా సవాల్‌ను స్వీకరించాలి.

## విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ఓటుతో విముక్తి కల్పించారు

మొదటి పేజి తరువాయి

అలాంటి విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ప్రజలు తమ ఓటుతో రాష్ట్రానికి విముక్తి కల్పించారని, ఆ రోజు చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు బటన్ నొక్కి పైశాచిక ఆనందం పొందేవారని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రజలతో మమేకమవుతూ, నేరుగా వారి వద్దకే వెళ్లి సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు.

పేదలే తొలి ప్రాధాన్యం – పెంచిన పింఛన్లే నిదర్శనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పేదల కోసం పనిచేస్తోందని, దానికి పెంచిన పింఛన్లే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి తొలి నెల నుంచే పింఛన్లను పెంచి అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4,000 చేశామని, దివ్యాంగులకు రూ.6,000కు పెంచామని గుర్తు చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఆరోగ్య పింఛన్లను రూ.10,000, రూ.15,000కు పెంచామని వివరించారు. 2024 జూలై నుంచి ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.65,887 కోట్లు అందించామని, ఏడాదికి ఈ ఒక్క పథకం కోసమే దాదాపు రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ.2,729 కోట్లు పంపిణీ చేస్తున్నామని, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదని అన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి

పేదరికం లేని సమాజాన్ని చూడాలన్నదే తన కల అని చంద్రబాబు అన్నారు. కేవలం పింఛన్లే కాకుండా 'తల్లికి వందనం', 'స్త్రీశక్తి', 'అన్నదాత సుఖీభవ' వంటి అనేక పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గడిచిన 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వంటివి యువతకు ఉపాధి మార్గాలు చూపుతాయని అన్నారు.

### విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పాఠశాలల్లో పాఠ్యాంశాలు మారుస్తున్నామని, నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఖరీదైన వైద్యం కోసం ప్రజలు అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తీసుకువస్తున్నామని ప్రకటించారు. 'సంజీవని' పేరుతో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అపాయింట్‌మెంట్లు, ఆరోగ్య సందేహాల నివృత్తి కోసం 'ఏఐ డాక్టర్' సేవలను కూడా అందుబాటులోకి తెస్తామని వివరించారు. రాష్ట్రాన్ని 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

ప్రాంతీయ అభివృద్ధి.. పోలవరం పూర్తి

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి వరకు విశాఖ రీజియన్‌గా, పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకు అమరావతి రీజియన్‌గా, తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2027లో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని, ఆ లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులను జూలై నాటికి పూర్తి చేసి నీరందిస్తామని చెప్పారు. మత్స్యకారుల కోసం రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లను సబ్సిడీపై అందిస్తామని, అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.

### సుపరిపాలనే ధ్యేయం.. కలిసికట్టుగా ముందుకి

ప్రజలకు నాణ్యమైన పౌరసేవలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. '2047 స్వర్ణాంధ్ర విజన్'తో రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. ఈ యజ్ఞంలో మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తికరంగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## విశాఖను డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

ఇందులో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత సంస్థ ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో ముంబయిలో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. విశాఖపట్నంలో 'ఎయిర్‌ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్'ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం వేగంగా ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా ఆవిర్భవిస్తోంది. ఇప్పటికే గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అన్ని విధాలా అనుకూలమైన నగరం. ఇక్కడ 6 గిగావాట్ల డేటా సెంటర్లను నెలకొల్పాలన్నది మా లక్ష్యం. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై మేం ప్రత్యేక దృష్టి సారించాం" అని వివరించారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతంలో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు ఏపీలో అందుబాటులో ఉన్నాయని, డేటా సెంటర్లకు అవసరమైన నిరంతర విద్యుత్ కోసం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు కూడా సిద్ధంగా ఉన్నాయని లోకేష్ తెలిపారు. ఎయిర్‌ట్రంక్‌ను ఏపీకి తీసుకురావాలన్న ప్రయత్నాలు గత కొంతకాలంగా జరుగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి రాబిన్ ఖుదాతో సమావేశమై ఏపీ దార్శనికతను వివరించారు. ఆ తర్వాత ఎయిర్‌ట్రంక్ బృందం, ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపింది. అయితే, భారత్‌లో కార్యకలాపాలకు ఒక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసుకున్న తర్వాతే విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని అప్పట్లో ఎయిర్‌ట్రంక్ తెలిపింది. ఈ నేపథ్యంలో, ఎయిర్‌ట్రంక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారికంగా భారతదేశంలోకి ప్రవేశించింది. బ్లాక్‌స్టోన్ మద్దతు ఉన్న డేటా సెంటర్ ప్లాట్‌ఫాం 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా'ను టేకోవర్ చేసింది. ఈ స్వాధీనంతో ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో సుమారు 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు ఆ సంస్థ చేతికి వచ్చాయి. ఇది ఎయిర్‌ట్రంక్‌కు భారత్‌లో తక్షణ కార్యకలాపాలకు మార్గం సుగమం చేసింది. తమ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భారత్‌ను ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో, లోకేష్ మరోసారి రాబిన్ ఖుదాతో భేటీ అయి, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. దీనిపై రాబిన్ ఖుదా స్పందిస్తూ... ఎయిర్‌ట్రంక్ భారత ప్రణాళికలు, లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా ఏకీకరణ, భవిష్యత్ విస్తరణ రోడ్‌మ్యాప్ వంటి అంశాలను చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ భేటీతో విశాఖలో మరో భారీ పెట్టుబడికి మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రైవేట్ సంస్థ కోసం టెండర్ రూల్స్ మార్చారు

మొదటి పేజి తరువాయి

నెట్టేశారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్ఈ బోర్డుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 12వ తరగతి డిజిటల్ మూల్యాంకన ప్రక్రియ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఓ ప్రైవేట్ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలను తుంగలో తొక్కడం వల్లే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ధ్వజమెత్తారు.

ఒక్క కంపెనీ కోసం?

ఈ వివాదంపై పరిశోధన చేసిన విద్యార్థి సార్థక్ సిద్ధాంత్ నివేదికను రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "మే 2025లో విడుదల చేసిన సీబీఎస్ఈ టెండర్ నిబంధనల ప్రకారం.. ఆన్సర్ షీట్లను ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లతో కనీసం 300 డీపీఐ స్పష్టతతో స్కాన్ చేయాలి. కానీ ఆగస్టులో మళ్లీ విడుదల చేసిన టెండర్‌లో ఈ రూల్స్ అన్నింటినీ గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. 'కోఎఫ్ట్ ఎడ్యూటెక్' అనే ఒకే ఒక్క ప్రైవేట్ కంపెనీకి ఈ కాంట్రాక్ట్ కట్టబెట్టడానికే నిబంధనలను మార్చారని ఆరోపించారు.

మొబైల్ ఫోన్లతో స్కాన్

టెండర్ మార్పుల వల్ల స్కాన్ల క్వాలిటీని 200 డీపీఐకి తగ్గించారని చివరికి సదరు సంస్థ ఆన్సర్ షీట్లను ప్రొఫెషనల్ స్కానర్లతో కాకుండా మొబైల్ ఫోన్లతో స్కాన్ చేసిందని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఫలితంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో పేజీలు సరిగ్గా కనిపించకపోవడం, బ్లర్‌గా మారడం, కొన్ని పేజీలు పూర్తిగా మాయమవడం వంటి దారుణాలు జరిగాయన్నారు. ఇవన్నీ పొరపాట్లు కావని, ఒక వెండర్‌కు లాభం చేకూర్చడం కోసం చేసిన పక్కా ప్లాన్ అని, ఇది ముమ్మాటికీ పెద్ద మోసమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రధాని మౌనంపై విమర్శలు

దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఈ భారీ స్కామ్‌పై ప్రధానమంత్రి మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘోర వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎథికల్ హ్యాకర్ బయటపెట్టిన లోపాలు

మరోవైపు 19 ఏళ్ల ఎథికల్ హ్యాకర్ నిసర్గ అధికారి కూడా ఈ డిజిటల్ మూల్యాంకన పోర్టల్‌లోని భద్రతా లోపాలను స్క్రీన్ షాట్లతో సహా బయటపెట్టారు. ఇంటర్నెట్ ఉన్న ఎవరైనా విద్యార్థుల ఆన్సర్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అలాగే స్కాన్ చేసిన పేజీలపై మొబైల్ ఫోన్ల నీడలు, మడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని సార్థక్ సిద్ధాంత్ కూడా ఆధారాలను బయటపెట్టారు. ప్రొఫెషనల్ స్కానర్లు వాడితే ఇలాంటి నీడలు రావడం అసాధ్యమని బోర్డును ప్రశ్నించారు.

## గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి

మొదటి పేజి తరువాయి

కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు. పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

### పశ్చిమాసియాలో శాంతికి
## 'భారత్' ఒక్కటే మార్గం

మొదటి పేజి తరువాయి

భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి వేదిక

ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణా వల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయి. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకం" అని ఆయన పేర్కొన్నారు.

### భారతీయుల్లో ఇజ్రాయెల్‌పై 'క్రేజీ లవ్'

ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. "భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉంది. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారు" అని నెతన్యాహు సంతోషం వ్యక్తం చేశారు.

### పారదర్శకతే లక్ష్యం..
## టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు


హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో నియామక పరీక్షల నిర్వహణకు కంప్యూటర్ ఆధారిత విధానమే అత్యుత్తమ మార్గం. సంప్రదాయ ఓఎంఆర్ విధానంతో పోలిస్తే ఇది ఎంతో సురక్షితమైనది. పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసే వెసులుబాటు ఉంటుంది" అని వివరించారు. కమిషన్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నామని, అభ్యర్థుల్లో విశ్వాసం నింపేందుకు సాంకేతికతను వాడుకుంటున్నామని తెలిపారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వడం సాధ్యం కాదని, అందుకే పోటీ పరీక్షల్లో కొందరికి నిరాశ తప్పదని ఆయన అన్నారు. కమిషన్‌పై వచ్చే నిరాధార విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పారదర్శకతను పెంచే ఉద్దేశంతో ఇకపై ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక







ప్రచురణ : తెలంగాణ, సంపుటి 02, సంచిక 60, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, మంగళవారం - 02 - జూన్ - 2026 , వెల రూ.5/-

## పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు



టీజీపీఎస్సీలో ఇకపై అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగానే

ఓఎంఆర్ కంటే కంప్యూటర్ విధానమే అత్యంత సురక్షితం అన్న చైర్మన్

2లో

## ఇరాన్ రాజకీయాల్లో కార్చిచ్చు: 'సైనిక తిరుగుబాటు' అంటూ అధ్యక్షుడు పెజెష్కియాన్ రాజీనామా



ఐఆర్‌జీసీ కమాండర్ల చేతుల్లోకి వెల్లిన దేశ సర్వాధికారాలు

క్షిపణి దాడులను 'పిచ్చిచర్య'గా అభివర్ణించిన అధ్యక్షుడు

సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీకి లేఖ

టెహ్రాన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం!

2లో

## నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు.. సీబీటీ పిటిషన్ తిరస్కరణ



నీట్ రీ-టెస్ట్‌ను కంప్యూటర్ విధానంలో నిర్వహించాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

జూన్ 21న ఓఎంఆర్ పద్ధతిలోనే పరీక్ష యథాతథంగా జరుగుతుందని స్పష్టం

2లో

## 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి



జూన్ 25 నుండి సర్ ప్రారంభమవుతుంది

2లో

"కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేది

65 సంవత్సరాలలో కాంగ్రెస్ చేయని పని ఆరు నెల్లల్లో కేసీఆర్ చేసి చూపించారు

24 గంటల పాటు రైతులకు, పరిశ్రమలకు కేసీఆర్ నాణ్యమైన కరెంటు ఇచ్చారు"

# "రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం

## ఆ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎత్తేసేది లేదు

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన తమకు లేదు

- ★అలాగైతే మేం ఎన్నికల్లో పోటీ చేయం
- ★రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన కేంద్రం ఎప్పుడూ పెట్టలేదు
- ★"కిషన్‌రెడ్డికి నేను ఒకటే చెప్పదలుచుకున్నా. వడ్లు కొనంది మీరు..
- ★రైతు పండించిన ప్రతీ గింజను మా ప్రభుత్వం కొంటుంది



హైదరాబాద్: మోటర్లకు మీటర్లు పెట్టినా.. రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేసినా మేం ఎన్నికల్లో పోటీ చేయం.. ఒక వేళ మోటర్లకు మీటర్లు పెట్టకపోయినా.. ఉచిత విద్యుత్ కొనసాగించినా ఎన్నికల్లో పోటీ నుంచి బీఆర్ఎస్ తప్పుకుంటుందా? అంటూ ఆ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2 లో

## రైతు డిస్కం పేరిట విద్యుత్తు ప్రైవేటీకరణకు కుట్ర: కె.కవిత



2లో

- రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతు డిస్కం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం'
- 'ఆరు నెలలుగా రహస్యంగా ఉంచిన రైతు డిస్కం అంశాన్ని ఇప్పుడు బయటపెట్టడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది
- మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి
- పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దసరాలోపు ప్రారంభించాలి

# ప్రైవేట్ సంస్థ కోసం టెండర్ రూల్స్ మార్చారు

## సీబీఎస్ఈ టెండర్లలో అవినీతి జరిగింది

ఫోన్లతో ఆన్సర్ షీట్ల స్కానింగ్'..

సీబీఎస్ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ నిప్పులు!

మొబైల్ ఫోన్లతో ఆన్సర్ షీట్లను స్కాన్ చేసినట్లు వెల్లడి

పోర్టల్ హ్యాక్ చేసి లోపాలను బయటపెట్టిన ఎథికల్ హ్యాకర్

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్



ఢిల్లీ: మొబైల్ ఫోన్లతో ఆన్సర్ షీట్లను స్కాన్ చేసి దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి మిగతా 2 లో

# తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారు

## ▶▶హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'

- ▶▶హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం.. క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!
- ▶▶హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న



హైదరాబాద్: హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభపై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మిగతా 2 లో

## పశ్చిమాసియాలో శాంతికి 'భారత్' ఒక్కటే మార్గం

### పశ్చిమాసియా స్థిరత్వంలో భారత్‌ది కీలక పాత్రన్న ఇజ్రాయెల్ రాయబారి

భారత్ ఆర్థిక వృద్ధి ద్వారా ఈ ప్రాంతానికి ట్రిలియన్ డాలర్ల లబ్ధి

భారతీయుల్లో ఇజ్రాయెల్ పట్ల 'క్రేజీ లవ్' ఉందన్న ప్రధాని నెతన్యాహు



ఢిల్లీ: భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి మిగతా 2 లో

## మే నెలలో తిరుమలకు పోటెత్తిన భక్తులు.. శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం




2లో

- మే నెలలో తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం
- వేసవి సెలవులతో భారీగా తరలివచ్చిన భక్తులు
- 25 లక్షల మందికి పైగా భక్తులకు స్వామివారి దర్శనం
- హుండీ ద్వారా రూ. 120 కోట్లకు పైగా కానుకలు
- 12 లక్షల మందికి పైగా తలనీలాలు సమర్పణ

## విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ఓటుతో విముక్తి కల్పించారు

మీటింగ్ ల నుంచి జనం వెళ్లిపోకుండా కందకాలు తవ్వారు: చామవరం సభలో చంద్రబాబు



తుని నియోజకవర్గం చామవరంలో 'పేదల సేవలో' సభ

గత ప్రభుత్వంపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు

నాడు భయానక వాతావరణం ఉండేదని విమర్శలు

బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యలు

అది చరిత్రలో నిలిచిపోయే రోజన్న చంద్రబాబు

అమరావతి: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భయానక వాతావరణం ఉండేదని, బహిరంగ సభలకు వచ్చిన ప్రజలు మధ్యలో వెళ్లిపోకుండా అడ్డుకోవడానికి ఏకంగా కందకాలు తవ్వి, ఫెన్సింగ్‌లు వేసి నిర్బంధించే దుస్థితి ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. మిగతా 2 లో

# గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి

## పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ★పన్నుల ఎగవేత దారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం.. డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!
- ★పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న



అమరావతి: గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై మిగతా 2 లో

# ఖమ్మం ఎఫ్ఎస్టీపీ ద్వారా పారిశుధ్య నిర్వహణలో మెరుగైన ఫలితాలు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో పారిశుధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ ఎస్టిపి) సమర్థవంతంగా పనిచేస్తోంది. నగర పరిధిలోని సెప్టిక్ ట్యాంకులు, ఆన్‌సైట్ శానిటేషన్ వ్యవస్థల నుంచి సేకరించే ఫీకల్ స్లడ్జ్‌ను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేసి పర్యావరణహితంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్లాంట్‌లో సేకరించిన వ్యర్థాలను వివిధ దశల్లో శుద్ధి చేయడం ద్వారా ద్రవ, ఘన అవశేషాలను వేరు చేస్తున్నారు. శుద్ధి అనంతరం లభించే నీరు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఘన అవశేషాలను సేంద్రియ ఎరువు తయారీకి వినియోగించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. ఎఫ్ఎస్టీపీ నిర్వహణ ద్వారా నగర పరిధిలో మలినాల అక్రమ పారుదల నియంత్రణకు తోడ్పడటంతో పాటు భూగర్భ జలాల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు సహకారం అందుతోంది. ప్రజారోగ్య





పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన పట్టణ వాతావరణం ఏర్పడేందుకు ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తోంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నగర పారిశుధ్య నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్థిరమైన, పర్యావరణహిత కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఎఫ్ఎస్టీపీ విజయవంతమైన నిర్వహణ నగర వ్యర్థాల నిర్వహణలో ఒక ఆదర్శవంతమైన నమూనాగా నిలుస్తూ, స్వచ్ఛ ఖమ్మం లక్ష్య సాధనకు దోహదపడుతోంది.

# ఇందిరమ్మ ఇళ్ళు పేదల కన్నీటి జల్లు

**– స్థానిక ఇసుక రవాణా లేక నిలిచిన నిర్మాణాలు**

**ఇందిరమ్మ రాజ్యం కాదు, కన్నీటి కాష్టం**

**– తక్షణమే ఇసుక రవాణా పునరుద్ధరణ చేయాలి– ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విద్యాచందనకు మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ వినతి**



మణుగూరు, నేటి శుభోదయ :::పినపాక నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరతతో నిలిచిపోయాయని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం (ఐడిఓసి) కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందనకు దుర్గ వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి నది పరివాహక ప్రాంతంలో పుష్కలంగా ఇసుక లభిస్తున్నప్పటికీ, ఇందిరమ్మ ఇండ్ల స్థానిక పేద లబ్ధిదారులకు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమన్నారు. మరోవైపు అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా కొనసాగుతుండటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం అప్పులు చేసి పునాదులు వేసుకున్న అనేక నిరుపేద కుటుంబాలు ఇసుక దొరకక, పనులు ముందుకు సాగక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, ఇసుక కొరత కారణంగా ఆ లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. జిల్లా యంత్రాంగానికి అయిదు కీలక విజ్ఞప్తులు చేస్తూపాల్వంచ దుర్గ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. పినపాకలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులకు సబ్సిడీపై లేదా ఉచితంగా ఇసుక సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని, మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించి ఇసుక పంపిణీని పర్యవేక్షించాలని, నిలిచిపోయిన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పేదల సొంతింటి కల సాకారం కావాలంటే ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు.

# డ్రైనేజీ సిల్ట్ సమస్య పరిష్కారానికి గౌతమ్ నగర్‌లో మాజీ కార్పొరేటర్ పర్యటన



కూకట్పల్లి, జూన్ 01(నేటిశుభోదయ )కూకట్పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో డ్రైనేజీల నుంచి తొలగించిన సిల్ట్‌ను సుమారు 15 రోజులుగా ఎత్తివేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిల్ట్ కుప్పల కారణంగా దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమల బెడద పెరిగి కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానికులు వాట్సాప్ ద్వారా మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే గౌతమ్ నగర్‌లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వాటర్ వర్క్స్ అధికారి హిమజతో ఫోన్‌లో మాట్లాడి, డ్రైనేజీ సిల్ట్ మరియు మట్టి కుప్పలను తక్షణమే తొలగించాలని కోరారు. సతీష్ గౌడ్ జోక్యంతో స్పందించిన అధికారులు జేసీబీ సహాయంతో సిల్ట్, మట్టి కుప్పలను వెంటనే తొలగించి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు ఉపశమనం పొందారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు శశి, వేణు, ఎల్లయ్య గౌడ్, సురేందర్, శేఖర్, శ్రీనివాస్, శ్రవణ్ గుప్తా, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# 14వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణి




నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ సోమవారం రోజున 14వ వార్డులో చేయడం జరిగింది ముందుగా గ్రూప్ మహిళలకు అందించి మిగతావారు కూడా అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా విచ్చేసిన మహిళలందరికీ పేరుపేరునా నమస్సుమాంజలి ఈ కార్యక్రమం వార్డ్ కౌన్సిలర్ ఉల్లిగడ్డల ఉమారాణి నాగరాజ్ ఆధ్వర్యంలో జరిగింది ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం ప్రతి ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని 14వ వార్డు కౌన్సిలర్ ఉల్లిగడ్డల ఉమారాణి నాగరాజ్ తెలియజేశారు

# ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత



నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి:సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను మార్కండేయ స్లం సమైఖ్యకు చెందిన ద్వాక్రా గ్రూప్ మహిళలు పెద్ద సంఖ్యలో పి ఎం. ఆర్ గణేష్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మన తెలంగాణ ప్రభుత్వం ఇచ్చినటువంటి చీరలను 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ప్రతి ఒక్కరికి పంపిణి చేశారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి మమత మాట్లాడుతూ మన రేవంత్ రెడ్డి గారు తయారు చేసిహించినటువంటి చీరలు చాలా బాగున్నాయని అందరూ కట్టుకునేలా తయారు చేయించినందుకు గాను తన12వ వార్డు ప్రజల తరపున వారికి ప్రతేక ధన్యవాదములు తెలియజేశారు. రానున్న రోజులలో ఇంకా మరింత కొత్త ఆలోచనలతో ఈ చీరలను రూపొందించాలని అన్నారు. ఇట్టి కార్యక్రమం ఆర్.పి రుమాండ్ల శారద, ఎస్ హెచ్ జి (ఓబి) మాలె అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని పులిమామిడి మమత తెలిపారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు కొత్త వస్త్రాలు అందించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 12వ వార్డులోని ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ద్వాక్రా మహిళలు స్రవంతి, కవిత, రాణి, ఈశ్వరమ్మ, అనంత, రుక్కమ్మ, శైలజ, లక్ష్మి, ఆరిఫా,పాతిమ,గౌసియా బేగం, మల్లికా బేగం, నసీమ బేగం, తాయెరా బేగం,ప్రజలు, మహిళలు, స్థానిక నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందిరమ్మ చీరలు అందుకున్న మహిళలు ప్రభుత్వానికి మరియు కౌన్సిలర్ పులిమామిడి మమతకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆన్లైన్ మార్కెట్ బెట్టింగ్ ల తో కూలుతున్న కొంపలు




నేలకొండపల్లి , నేటి శుభోదయ ::: అన్ లైన్ మార్కెట్ బెట్టింగ్ లో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... నేలకొండపల్లి మండలం లో భారీగా బాధితులు ఉన్నట్టు సమాచారం ఆన్లైన్ షేర్ మార్కెట్,మొన్న నేలకొండపల్లి, ఈ రోజు అనాసాగరం రేపు మరొక ఊరు సోషల్ మీడియా ద్వారా పరచాయలు తో ఆశల కూ లోను అయ్యి భారీగా పెట్టుబడి పెట్టడం, ఇవ్వాళ కాక పోతే రేపు డబ్బులు వస్తాయి అని ఆశ అసలుకే ఎసరు లక్షలు, కోట్లు పోగొట్టుకొని ఆస్తులు అమ్ముకొనే పరిస్థితి దివాళా తీసిన విషయం తెలుసుకున్నాక భార్య బంధువులు తో పెద్ద మనుషులు తో లెక్కలు తెల్చుకొని తట్ట బుట్ట సర్దుకొని పోతున్నారు కొంతమంది ప్రబుద్దులు. అస్సలు కుటుంబాలనే పట్టించుకోవడం లేదు. భార్య పేరు మీద, భార్య కుటుంబ సభ్యుల పేరు కూడ లోన్లు తీసుకొని ఇబ్బంది పెట్టడం జరుగుతుంది. యువత తొందరగా, ఈజీ గా డబ్బులు సంపాదించాలి,అనే ఆలోచన తప్పుదోవ పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఎంత అవగాహన కల్పించిన ఫలితం లేదు. ఇంకా బయటకు రాని కుటుంబాలు ఎన్ని ఉన్నాయో వారందరికీ మరొక్కసారి అవగాహన సదస్సు కల్పించాలని కొందరు అధికారులను కోరుతున్నారు.

# పేదోడికి గూడు, కూడు ఇందిరమ్మ రాజ్యంలోనే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



( నేటి శుభోదయ మహేశ్వరం జూన్ 01:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలంలోని, సుభాన్ పూర్, మాణిక్యమ్మగూడ, చిన్నతూర్ప గ్రామాల్లోని ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్న పేదోడికి కూడు, గూడు కల్పించేది నాటి నుంచి నేటి వరకు ఇందిరమ్మ రాజ్యంలోనేన్నారు కేఎల్ఆర్. సన్నబియ్యం ఇస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి కి దక్కుతుందన్నారు. దశాబ్ద కాలంలో ఒక్క ఇల్లు కట్టించని బీఆర్ఎస్ కు కాంగ్రెస్ సర్కార్ ను విమర్శించే అర్హత లేదన్నారు. లక్ష్మారెడ్డి పర్యటనతో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా కాన్వాయ్ లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# యువ ఫుట్‌బాల్ క్రీడాకారులకు జీపీ ఫాల్గుణ ప్రోత్సాహం



నేరెడ్ మెట్, జూన్ 1,నేటి శుభోదయ:రామకృష్ణాపురంలోని రెయిన్‌బో ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్‌ను జీపీ ఫాల్గుణ సందర్శించి యువ క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మైదానానికి వచ్చిన ఆయన ఆటగాళ్లతో మమేకమై వారి ప్రతిభ, శిక్షణ విధానాలపై ఆరా తీశారు. యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీపీ ఫాల్గుణ అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహకరమైన సందేశాలు ఆటగాళ్లు, తల్లిదండ్రులు, కోచ్‌లు మరియు క్లబ్ సభ్యుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని రెయిన్‌బో ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి ఇలాంటి ప్రోత్సాహం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెయిన్‌బో ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి ఎల్. దీనన్ కుమార్ మాట్లాడుతూ, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్‌ను సందర్శించి యువ క్రీడాకారులకు విలువైన సూచనలు అందించిన జీపీ ఫాల్గుణకు క్లబ్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సందర్శన యువ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ప్రేరణగా నిలిచిందన్నారు. ఫుట్‌బాల్ క్రీడను గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేసి యువ ప్రతిభను వెలికితీసేందుకు క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని, భవిష్యత్తులో కూడా జీపీ ఫాల్గుణ మార్గదర్శకత్వం అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం క్లబ్ సభ్యులు, క్రీడాకారులు మరియు తల్లిదండ్రుల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# కేపీహెచ్‌బీ డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి, జూన్ 01(నేటిశుభోదయ )కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గతంలో మంజూరైన నిధులతో చేపడుతున్న నూతన పైప్‌లైన్లు, రోడ్ల నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ డివిజన్ అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా నాలుగో ఫేజ్‌లో నిరుపేదలు మరియు స్థానిక ప్రజల అవసరాల కోసం అత్యాధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కమ్యూనిటీ హాల్‌ను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం అది చెత్తాచెదారం మరియు బూజుతో నిండిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునేలా నిర్మించిన ఈ భవనాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచకుండా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా మహిళా మండలి భవనాన్ని కూడా మహిళల అవసరాల కోసం నిర్మించినప్పటికీ, అదే పరిస్థితికి గురిచేశారని పేర్కొన్నారు. గతంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులు నిర్మించి ఉచితంగా మంచినీటిని అందించామని, ప్రస్తుతం నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ఇండోర్ స్టేడియంలు వంటి ప్రజా ఉపయోగకరమైన వసతులను అభివృద్ధి చేశామని, వాటి నిర్వహణలో ప్రస్తుత పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజల అవసరాల దృష్ట్యా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు తాను ఎప్పుడూ సహకరిస్తానని, అయితే ప్రజా ఆస్తులను నిర్లక్ష్యం చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, రాజేష్ రాయ్, జున్ను సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, భారతి, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు రవి తండ్రి అంత్యక్రియల్లో ప్రజా ప్రతినిధులు



( నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి )నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని సిసికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం రవి తండ్రి బాకారం రాములు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినందున. ఆయన స్వగ్రామం తాళ్లరామడుగులో సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్. భూపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాములు భౌతిక కాయం వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు. అంత్యక్రియల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, బిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్ తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు మండల కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# రూ .1.50 వేల విలువ కలిగిన-గుట్కా ప్యాకెట్ల పట్టివేత..!!



హనుమకొండ జిల్లా ప్రతినిధి (మౌళి)నేటి శుభోదయ (జూన్ 1); హనుమకొండ పట్టణంలో సోమవారం నాడు కమిషనరేట్ పరిధిలో గుట్కా అక్రమ వ్యాపారస్తుల పై పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఏకకాలంలో పోలీసులు మూడు దుకాణాలపై దాడి చేసిరూ ..ఒక లక్షల 50 నిలువ గలిగిన గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. బాలసముద్రం, టైలర్ స్ట్రీట్ కిరాణా దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 75 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను, బాలసముద్రంలో ఆకుల శ్రీనివాస్ దుకాణంలో రూ. 23 వేల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారూ. టైలర్ స్ట్రీట్ లోని మహాదేవ్ జనరల్ స్టోర్ లో రూ. 52 వేల గుట్కా ప్యాకెట్లు పట్టుకొని సీజ్ చేసినారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక.

# మజీద్‌పూర్ శివాలయంలో మైనంపల్లి ప్రత్యేక పూజలు

**రాష్ట్ర శాంతి, ప్రజల సౌభాగ్యం కోసం ప్రార్థనలు**




శామీర్ పేట, జూన్ 1:శామీర్‌పేట్ మండలంలోని మజీద్‌పూర్ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శివాలయంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు, అర్చనలు చేసి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, వ్యవసాయాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని, సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందేందుకు దేవాలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హనుమంతరావుకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక సత్కారం నిర్వహించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు బిమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ సామల జస్వంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ ఏళ్ళ మల్లేష్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గిర్మాపూర్ నర్సింగరావు గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కోడూరి నర్మద, శివాలయ దేవస్థానం చైర్మన్ కానిశెట్టి సుందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు నాటకారి వెంకటయ్య, అబ్బాగౌని భాస్కర్ గౌడ్, అబ్బాగౌని జగదీశ్వర్ గౌడ్, కుదుముల వెంకటేష్, అబ్బాగౌని వినోద్, తుంకి లక్ష్మయ్య, అబ్బాగౌని శ్రీశైలం గౌడ్, మైలారం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సినీ రంగంలో విజయం సాధించాలంటే మానసిక దృఢత్వమే కీలకం



నేరేడ్ మెట్, జూన్ 1నేటి శుభోదయ:ఒత్తిడి, పోటీని అధిగమించేందుకు ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ అవసరం: సైకాలజిస్ట్ రాజ్ ఆచార్యసినీ రంగంలో విజయాన్ని అందుకోవాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదని, మానసిక దృఢత్వం, ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ వంటి లక్షణాలు అత్యంత కీలకమని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్, సినీ దర్శకుడు రాజ్ ఆచార్య పేర్కొన్నారు. సినీ రంగ వ్యక్తుల ప్రవర్తనా సరళి, విజయాలు-పరాజయాలు, మానసిక ఒత్తిళ్లు మరియు లక్ష్య సాధనపై ఆయన శాస్త్రీయ విశ్లేషణను విడుదల చేశారు.సినీ రంగం బయటకు ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, అంతర్గతంగా తీవ్రమైన పోటీ, అనిశ్చితి, మానసిక ఒత్తిళ్లతో నిండి ఉంటుందని తెలిపారు. ఈ రంగంలో రాణించాలనుకునే వారు తమ కంఫర్ట్ జోన్‌ను విడిచిపెట్టి కష్టపడే మనస్తత్వాన్ని అలవరచుకోవాల్సి ఉంటుందని సూచించారు. కలలను సాకారం చేసుకునే క్రమంలో సమయం, ధనం, వ్యక్తిగత సౌకర్యాలు, కుటుంబంతో గడిపే సమయాన్ని సైతం త్యాగం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.విజయానికి కోరికల నియంత్రణ ప్రధాన మూలస్తంభమని, తాత్కాలిక ఆనందాల కంటే దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించే “డిలేడ్ గ్రాటిఫికేషన్” విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. విమర్శలు, అపజయాలు, ప్రతికూల పరిస్థితులను అధిగమించే మానసిక స్థైర్యం ఉన్నవారే దీర్ఘకాలిక విజయాలను సాధిస్తారని వివరించారు.ప్రతిభ ఉన్నప్పటికీ అనేక మంది ఆశించిన స్థాయికి చేరుకోలేకపోవడానికి అవాస్తవిక అంచనాలు, భావోద్వేగ అస్థిరత, త్వరిత విజయాలపై మోజు వంటి మానసిక కారణాలే ప్రధానమని రాజ్ ఆచార్య విశ్లేషించారు. పరిశ్రమలోని పోటీని తట్టుకోలేకపోవడం, విమర్శలను స్వీకరించలేకపోవడం కూడా వెనుకబడటానికి కారణమవుతుందని తెలిపారు.సినీ రంగంలో అవకాశాల అనిశ్చితి కారణంగా కొందరు తీవ్ర ఆందోళన, నిరాశ, అభద్రతా భావాలకు గురవుతారని, మరికొందరు ఒత్తిడి నుంచి బయటపడేందుకు వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఇటువంటి పరిస్థితులు వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.సినీ పరిశ్రమలో ఉన్నవారు ఉద్వేగ నిరోధకత, కఠోర క్రమశిక్షణ, నిరంతర ఆత్మపరిశీలనను అలవర్చుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడి అధికమైనప్పుడు సంకోచించకుండా నిపుణులైన సైకాలజిస్టుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.లక్ష్యాలకు అనుగుణంగా ఆలోచనలు, అలవాట్లు, జీవన విధానాన్ని మార్చుకునే వారే విజయాన్ని అందుకుంటారని, మార్పును స్వీకరించడం వ్యక్తిగత వికాసానికి మూలాధారమని రాజ్ ఆచార్య పేర్కొన్నారు. సరైన మానసిక దృక్పథం కలిగిన వారు సినీ రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ విశేష విజయాలు సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

# విధిరాతకు ఎదురీది ప్రిన్సిపాల్ గా పదోన్నతి

**– ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఎస్ మల్లిక**



ఖమ్మం, ముదిగొండ, నేటి శుభోదయ ::: పట్టుదల ఉంటే సాధ్యం కానిదేది ఉండదని నిరూపించారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిక. ఇటీవల జరిగిన ప్రమోషన్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ముదిగొండ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొందిన ఎస్. మల్లికను ముదిగొండ ఎంపీడీవో విజయ ఘనంగా సన్మానించారు. పుట్టుకతో అంధురాలైనప్పటికీ బ్రెయిలీ లిపి ద్వారా చదువుకొని జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వ ఉద్యోగం సాధించి అంచలంచలుగా ఎదుగుతూ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొందడం విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పక తప్పదు అని తెలిపారు.

– ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేద్దాం ప్రభుత్వ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకులు, నాణ్యమైన విద్య లభిస్తుందని ఈ సందర్భంగా తెలియ జేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేలకొండపల్లి అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ యన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేలకొండపల్లి నందు డాక్టరేట్ పొందిన అధ్యాపకుల చేత బోధన జరుగుతుందని, అత్యాధునిక ప్రయోగశాలలు, బాలురకు, బాలికలకు విడివిడిగా కళాశాల ఆవరణలోనే హాస్టల్ సదుపాయం కలదని, ఈ ప్రాంత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ముదిగొండ సర్పంచ్ ఉపేందర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో విజయని, ముదిగొండ సర్పంచ్ ఉపేందర్ ని సన్మానించారు . ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం కెఎల్ఆర్

**ప్రజాపాలనలో ప్రతీ ఇంటికి కాంగ్రెస్ సంక్షేమం: కిచ్చెన్న**

**సాయంత్రం సీఎం లక్ష ఇండ్ల సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమం**

**మహేశ్వరం మండలంలో 32 ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల్లో పాల్గొన్న కేఎల్ఆర్**



( నేటి శుభోదయ మహేశ్వరం జూన్ 01:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం ఇంచార్జ్ ఇచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్ జిల్లాలో లక్ష ఇండ్ల సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు .మహేశ్వరం మండలంలో 32 ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించామని కేఎల్ఆర్ తెలిపారు. మహేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో..డబిల్ గూడ, సుభాన్ పూర్, మాణిక్యమ్మగూడ, మన్సాన్ పల్లి, చిన్నతూర్ప, అమీర్ పేట, మహేశ్వరం, గంగారం తండా గ్రామాల్లో పలు నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమంలో కె ఎల్ ఆర్ మాట్లాడారు. రేపు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజాపాలనలో ప్రతీ ఇంటికి కాంగ్రెస్ సంక్షేమం చేరుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కలను పేదలకు నెరవేర్చుతున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కుతుందని లక్ష్మారెడ్డి అన్నారు.గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రెండో విడతలో 2.50 లక్షల ఇండ్లను మంజూరు చేయనున్నట్లు కిచ్చెన్నగారు తెలిపారు.సన్నబియ్యం ఇచ్చి ప్రతీ పేదవాడి కడుపునింపేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.దశాబ్ద కాలంలో ఒక్క ఇల్లు కట్టించని బీఆర్ఎస్ కు కాంగ్రెస్ సర్కార్ ను విమర్శించే అర్హత లేదన్నారు.కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా కాన్వాయ్ లో పాల్గొనటంతో చూపరులను భారీ కార్ల వరుస ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఛైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏఎస్సై ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



ఖమ్మం, నేటి శుభోదయ ::: వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన నలుగురు పోలీస్ అధికారులు ఎస్ కే దొరసాని, ఎన్.శ్రీనివాసరాజు, జడ్ ఆదినారాయణ, జి.నాగేశ్వరరావు లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు మహబూబాబాద్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు.

# ధన్వాడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మంథని, జూన్ -01, నేటిశుభోదయ :మంథని నియోజకవర్గం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు గౌరవ ప్రదమైన నివాసం కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన



కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ , అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**: డిప్యూటీ కమిషనర్ జాకీయా సుల్తానా**



మల్కాజిగిరి, జూన్ 1,నేటి శుభోదయ:మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 24 ఫిర్యాదులు స్వీకరించినట్లు డిప్యూటీ కమిషనర్ జాకీయా సుల్తానా తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆమె సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ నుంచి 10, మౌలాలి సర్కిల్ నుంచి 4, ఆల్వాల్ సర్కిల్ నుంచి 8, కీసర సర్కిల్ నుంచి 2 ఫిర్యాదులు అందగా, బోయిన్‌పల్లి సర్కిల్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. మొత్తం జోనల్ పరిధిలో 24 వినతులు స్వీకరించినట్లు వెల్లడించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జాకీయా సుల్తానా సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడం జీహెచ్ఎంసీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీడీ యూబీడీ బి. శ్రీధర్‌రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) టి. ప్రశాంతి, డీవైఈఈ ఈ. లౌక్య, ఏసీపీ వి.బి. శ్రీనివాస్‌రావు, ఏఎంసీ అజయ్, ఏఎంసీ పి. శ్రావణి, యూసీడీ జేఏ బి. నిఖిల్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో కె. మంజుల, టీపీఎస్ సంగీత తదితర అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన పాలీ సెట్ కౌన్సిలింగ్



ఖమ్మం, నేటి శుభోదయ ::: పాలిటెక్నిక్ కళాశాలల ప్రవేశాలకు సంబంధించిన పాలీ సెట్ కౌన్సిలింగ్ గత నాలుగు రోజులుగా ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న కౌన్సిలింగ్ సోమవారం తో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు. చివరిరోజు 305 మంది వివిధ స్లాట్ల ద్వారా నమోదు చేసుకోగా 285 మంది హాజరయ్యారని వెల్లడించారు.

# అక్రమ మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ దాడి



(నిజామాబాద్ జిల్లా సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి) కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బషీరాబాద్ శివారులోని కాడి చెరువు వద్ద అక్రమంగా మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపుదాడి చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు సీపీ సాయి చైతన్య ఆదేశాలతో పోలీసు బృందం అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న కార్యకలాపాలను గుర్తించింది. మొరం తవ్వకాల కోసం వినియోగిస్తున్న ఒక జేసీబీ, మొరాన్ని రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

# బాబాయ్ ఇంట్లో చోరీ.. ముగ్గురి అరెస్టు



నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి :ఆర్మూర్ లో దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జూ సాయిచైతన్య వెల్లడించారు. ఈనెల 24న మహాలక్ష్మికాలనీలో నిందితుడు విజయ్ అగర్వాల్ తన బాబాయ్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. రూ.41.31లక్షల విలువైన బంగారం, వెండి, నగదు దొంగిలించారు. విజయ్ అగర్వాల్, సల్మాన్ ఖాన్, సాయికుమార్ ను అరెస్టు చేయగా మరో నిందితుడు శ్రీహరి పరారీలో ఉన్నాడు. వారి నుంచి రూ.31.48 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసినట్లు సీపీ చెప్పారు.

# నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, నేటి శుభోదయ ::: టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆమోదంతో సత్తుపల్లి నియోజకవర్గంలోని మండల,పట్టణ అధ్యక్షుల నియామకాన్ని సోమవారం ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆమోదంతో సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండల అధ్యక్షులుగా గొడుగునూరి లక్ష్మీరెడ్డిని, కల్లూరు మండల మండల అధ్యక్షులుగా పోట్రూ అర్జునరావు,పెనుబల్లి మండల అధ్యక్షులుగా పంది వేంకటేశ్వరరావు, సత్తుపల్లి మండల అధ్యక్షులుగా భీమిరెడ్డి సుబ్బారెడ్డి, వేంసూరు మండల అధ్యక్షులుగా కాసర చంద్రశేఖరరెడ్డి లను,సత్తుపల్లి పట్టణ అధ్యక్షులుగా గాదె చిన్నకేశవరావు, కల్లూరు పట్టణ అధ్యక్షులుగా షేక్ ఉస్మాన్ లను నియమించినట్లు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించిన మాజీ మండల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా వారికి అధినాయకత్వ సహకారంతో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా నూతనంగా సత్తుపల్లి నియోజకవర్గ మండల , పట్టణ అధ్యక్షులకు అభినందనలు తెలిపారు.అదే విధంగా సత్తుపల్లి మండల, పట్టణ అధ్యక్షుల నియామకానికి సహకరించిన టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు మట్టా రాగమయి దయానంద్ కు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు, మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వర్యులు రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి లకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

# ఐకెపి వివోఏ ల సమస్యలు పరిష్కరించాలి

**: సిఐటియు, డివైఎఫ్ఐ**



వైరా, నేటి శుభోదయ ::: ఐకెపి వివోఏ ల సమస్యల పరిశీలించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వివోఏ లు జేఏసీ ఆధ్వర్యంలో మే 18 నుండి రాష్ట్ర వ్యాప్తంగా శాంతి యుతంగా నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. వివోఏ ల 15 వ రోజు దీక్షకు సిఐటియు వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ నాగుల్ పాషా లో సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు, నాగుల్ పాషాలు మాట్లాడుతూ ఐకెపి వివోఏ లు గ్రామాలలో వెట్టి చాకిరి చేస్తున్నారని వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని గ్రామ వివో లతో సంబంధం లేకుండా నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ కల్పించాలని, వివోఏ ల అందరికీ సీసీలుగా పదోన్నతి కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, వివో ఎ లు అందరికీ ట్యాబ్ లు అందించాలని జీవో నెంబర్ 58 ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వివోఏ లా సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిచో ఆందోళన ఉదృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ దీపికల అధ్యక్ష, కార్యదర్శులు పద్మావతి, శైలజ, రాధా రమాదేవి, భవిత, కృష్ణ లీల హేమలత తదితరులు పాల్గొన్నారు.

# జె.పోతారంలో ఘనంగా శ్రీ బీరప్ప కామరతి దేవతల కల్యాణ మహోత్సవం

**భారీగా తరలివచ్చిన భక్తులు**


**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు**



అక్కన్నపేట, 01 జూన్ 2026 : నేటి శుభోదయ:సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జె.పోతారం గ్రామంలో శ్రీ బీరప్ప – కామరతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలను తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొమురవెల్లి ఆలయ ధర్మకర్త రాగుల మల్లేశం, పోసాన్‌పల్లి గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు పుల్ల రాయుడు, మద్దూరు గ్రామ కురుమ సంఘం కుల పెద్ద ఇరుమల పరుశరాంలు హాజరై, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమల ఆరాధ్య దైవమైన శ్రీ బీరప్ప, కామరతి దేవేరుల అనుగ్రహంతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ దేవుణ్ణి ప్రార్థించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ సంస్కృతిని, భక్తిభావాన్ని చాటిచెప్పే ఇలాంటి ఉత్సవాలు సమాజంలో అందరినీ ఏకం చేస్తాయన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో కురుమ సంఘం నాయకులు, గ్రామ ప్రముఖులు జెడ భిక్షపతి, జెడ రాకేష్, జెడ సురేష్, జెడ పరుషరాములు, గజ్జెలి శేఖర్, బండి కుమార్ లతో పాటు జె.పోతారం గ్రామ కురుమ సంఘం సభ్యులు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

# ఖమ్మం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

**: మెరుగు సత్యనారాయణ**




వైరా, నేటి శుభోదయ ::: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని సోమవారం వైరా రూరల్ కమిటీ సమావేశానికి హాజరైన సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ కోరారు. జూన్ 10వ తేదీన ముదిగొండ మండలం వెంకటాపురంలో జరగనున్న మహాసభల్లో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. – ఉపాధి హామీ పరిరక్షణలో నిర్లక్ష్యం కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే దురబుద్ధితో కఠిన నిబంధనలు తెచ్చిందని, కార్పొరేట్లకు గ్రామీణ పేదల శ్రమను దోచిపెట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేంద్రం 3 లక్షల కోట్లు కేటాయించాలి, సంవత్సరానికి 200 పని దినాలకు పెంచాలి, రోజు కూలీ 600 ఇవ్వాలి, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి.మహాసభల ఎజెండా: ఉపాధి హామీ చట్టం, కూలి, భూమి, ఉపాధి, సంక్షేమ పథకాల అమలు కోసం చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు.గిరిజన సంఘం నాయకులు భూక్య వీరభద్రం డిమాండ్లు:– రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి– అర్హులైన కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12,000 ఇవ్వాలి – స్థలాలు లేని వారికి ప్రభుత్వమే ఇండ్లు కట్టి ఇవ్వాలి– పెన్షన్లు పెంచి అర్హులకు కొత్త పెన్షన్లు ఇవ్వాలి సంఘం మండల అధ్యక్షులు బానాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి తుము సుధాకర్, డివిజన్ కార్యదర్శి కొండబోయిన నాగేశ్వరరావు ప్రసంగించారు.గంటమ్మ, ఎస్.కె రెహనా, ఎస్.కె మజీద్‌బీ, నర్వనేని సత్యనారాయణ, ఎస్.కె కాసింబీ, హుస్సేన్, సిఐటియు రూరల్ కన్వీనర్ తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కామేపల్లి మండలం సాతాని గూడెం గ్రామానికి చెందిన కన్నేటీ రంగయ్య ముచ్చర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 255, 262లో ఆరు ఎకరాల 20 గుంటలు వ్యవసాయ సాగు భూమి ఉందని, ఈ పొలంలోకి వెళ్ళుటకు దారి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన ఎం.వెన్నెల తనకు తల్లి తండ్రులు లేరని, 10వ తరగతి ఉత్తీర్ణత 493 మార్కులతో సాధించడం జరిగిందని, తనకు ఎం.పి.హెచ్.డబ్ల్యూ లో సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్.సి.ఓ బీసీ సంక్షేమ శాఖకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మికులకు అందించే ప్రసూతి ఆర్థిక సహాయం తనకు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, లేబర్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### ఆరుట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో

# వాటర్ బోర్డ్ అధికారులతో సమావేశం

-సరిపడా మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా చేయాలని అధికారులను నిలదీశారు.


-గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్,ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్.



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి జూన్ 1:మంచాల మండలం ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కు మార్ ఉపసర్పంచ్ నూకం రాజు ఆధ్వర్యంలో వాటర్ బోర్డ్ అధికారులతో కలిసి సమావేశం ని ర్వహించారు సమావేశంలో గత నాలుగు నెలల నుండి ఆరుట్ల గ్రామానికి సక్రమంగా మిషన్ భగీ రథ త్రాగునీరు సరఫరా కావడం లేదని వాటర్ బోర్డ్ అధికారులను నిల దీసిన గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు గ్రామసర్పంచ్ ఈసందర్భంగా అధికారులు సమాధానం ఇస్తూ పైనుండే మిషన్ భగీరథ త్రాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు అని డొంకతిరుగుడు సమాధానం చె ప్పారు ఆరుట్ల గ్రామానికి 9 లక్షల లీటర్ల త్రాగునీరు సరఫరా కావాల్సి ఉండగా 2 లక్షల లీటర్ల. నీరు సరఫరా అవుతుంది వెంటనే ప్రభుత్వం స్పందించి ఆరుట్ల గ్రామానికి సరిపడ మిషన్ భగీ రథ త్రాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి లేనిపక్షంలో ఆరుట్ల గ్రామ ప్రజలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తాం అని హెచ్చరించారు స్పందించిన వాటర్ బోర్డు అధికారులు ఆరుట్ల గ్రా మానికి త్రాగునీరు సక్రమంగా రావడానికి చర్యలు తీసుకుంటాం అని సమాధానం చెప్పారు ఈ కార్యక్రమంలో వాటర్ బోర్డు అధికారులు డిఈ వినయ్ కుమార్ నూతన ఏఈ అరుణ్ కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ వార్డు సభ్యులు పూన్నం రాము మంద మాధవి మోహన్ రెడ్డి మాడుగుల బాలమణి కృష్ణ గౌడ్ మొర్రిపద్మ ఐలయ్య లాలగారి మణెమ్మ సాతిరి సత్యం గ్రామస్తులు నూతనగంటి శేఖర్ ప్రజాగలం దామెర భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

- గుర్తింపు లేని కార్పొరేట్ ప్రవేట్ పాఠశాలను గుర్తించండి- నిబంధనలు విరుద్ధంగా యూనిఫామ్ స్టేషనరీ పుస్తకాలు విక్రయాలు నిర్వహిస్తే దాడులు చేస్తాం ఫీజులు నియంత్రణ ఏది - ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి




ఖమ్మం, నేటి శుభోదయ ::: గుర్తింపు లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలను అడ్మిషన్ ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆయా ఆయా పాఠశాలను సీజ్ చేసి ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఖమ్మం జిల్లా సమితి అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగామడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పర్మిషన్స్ లేకుండానే అడ్మిషన్ చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయి అని అన్నారు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి చోద్యం చూస్తున్నారే తప్ప గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆ పాఠశాలలో పై చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ ప్రభుత్వ అధికారులు గానీ దొంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు విద్యను సంతలో సరుగ్గా మార్చేశాయి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆయా విద్యా సంస్థలు మార్కెట్ కేంద్రాలుగా తలపిస్తు. మార్కెట్ చేస్తూ విద్యను పూర్తిగా వ్యాపార పరం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా ఆయా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అడ్మిషన్స్ తీసుకుంటే డొనేషన్లు బుక్స్ కు సపరేట్ యూనిఫామ్ సపరేట్ ఫీజులు వసూలు దందా కీ పురికలుపు తున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు జర్నలిస్ట్ పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో వైపు ఈ జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ, లుకు లక్ష పది ,లక్ష ఇరవై వేలు అంటూ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఫీజుల మోత మోగిస్తున్నా యన్నారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలని తల్లిదండ్రుల ఆశను ఆశరాగా మలుచుకున్న, కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు దోపిడీకి పురి కలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఈ జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్స్ పేర్లతో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు బనాయించి ఫీజులు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేస్తుంది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర మనోజ్, జిల్లా నాయకులు పవన్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అచ్చాయిపల్లిలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కాకూడదు. కల్యాణ లక్ష్మి పథకం ఎంతోమంది పేద తల్లిదండ్రులకు కొండంత అండగా నిలుస్తోంది.



ములుగు, 01 జూన్ 2026 : నేటి శుభోదయ:ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను సర్పంచ్ బుర్కల మమత కనకయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని పక్కాగా, నిరంతరాయంగా అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి స్వామి, వార్డు సభ్యులు కొమ్ము వినోద్ కుమార్, కాయిత శివ కుమార్, సత్తయ్య, లక్ష్మి నర్సింహా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము కృష్ణ, భూపాల్ రెడ్డితో పాటు అచ్చాయిపల్లి గ్రామానికి చెందిన యువకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన--2027 తొలి దశ ఇంటి జాబితా

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి.

-గృహ గణన ప్రక్రియను వేగవంతం చేయాలి.



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి జూన్ 1:భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న తొలి దశ ఇంటి జాబితా గృహ గణన ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జనగణన కార్యక్రమ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో జరుగుతున్న గృహ గణన పనులపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది వంటిది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రతి గృహాన్ని సందర్శించి, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలి. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం పూర్తిస్థాయిలో సేకరించడంతో పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా అత్యంత జాగ్రత్తతో విధులు నిర్వహించాలి” అని సూచించారు.అలాగే, “గణన ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి” అని ఆదేశించారు.జిల్లాలోని అన్ని మండలాల్లో గృహ గణన ప్రక్రియను మరింత వేగవంతం చేసి, వందకు వంద శాతం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

# బాధిత కుటుంబాలను పరామర్శ ఆరూరి



వరంగల్ ప్రతినిధి,జూన్ 01 (నేటి శుభోదయ):వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సోమవారం ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలతో పాటు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దుబ్బ శ్రీనివాస్ దుబ్బ వీరలక్ష్మి ఇటీవల మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కాశిబుగ్గలోని శ్రీనివాస్ నివాసానికి చేరుకుని వీరలక్ష్మి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న బాలాజీ నగర్ కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పస్తం యాదగిరి, సుందరయ్య నగర్ కు చెందిన జావిద్ లను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ నేపథ్యంలో ఏనుమాముల ప్రాంతానికి చెందిన పార్టీ నాయకుడు సౌరం జీవశాస్త్రి తల్లి కమలమ్మ



ఇటీవల మృతి చెందగా జీవశాస్త్రి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నేరేళ్ల రాజు, బండి రజిని కుమార్, కేతిరి రాజశేఖర్, గండ్రాతి భాస్కర్, ముడుసు నరసింహా, పత్రి సుభాష్, పత్రి రాజపోశాలు, జంగం రాజు, నాగనబోయిన మాధవి, నవీన్, సౌరం కళ్యాణ్, పస్తం నర్సింగం, కేతిరి సమ్మక్క, పున్నం ప్రభాకర్ ఆడెపు అశోక్ రాజమౌళి, సునీల్, ఏలీయా, అజయ్, పస్తం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి జూన్ 1:తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2, 2026 మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, కొంగరకలాన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సోమవారం పరిశీలించారు.“తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఈ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలి. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఏర్పాటును ముందుగానే పరిశీలించి పూర్తి చేయాలి” అని అన్నారు. వేడుకల నిర్వహణలో



ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రజావాణిలో (129) ఫిర్యాదులు

-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి.-ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి. -సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి జూన్ 1:సోమవారం జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (129) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల



పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు చెందిన (28) దరఖాస్తులు, ఇతర శాఖలకు చెందిన (101) దరఖాస్తులు, మొత్తం (129 ) దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జూన్ 2 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న “పర్యావరణ పరిరక్షణ మరియు అటవీ అవగాహన వారోత్సవాలను” విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.“ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక సమర్థవంతమైన వేదిక. ప్రజల వినతులపై అధికారులు స్పందనాత్మకంగా వ్యవహరించి త్వరితగతిన పరిష్కారం చూపాలి. అదే విధంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం, పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి” అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి (రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్), వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జె.ఈ.ఈ అడ్వాన్స్ ఫలితాలలో తొలి అడుగులోనే విజయదుంధుభి మ్రోగించిన స్టెమ్‌స్పార్క్ కాలేజ్ విద్యార్థులు




ఖమ్మం, నేటి శుభోదయ ::: స్థానిక శ్రీనగర్ కాలనిలోని స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు జె.ఈ.ఈ. అడ్వాన్స్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభతో మంచి ర్యాంకులను సాధించి విజయదుంధుబి మ్రోగించారు. స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే జె.ఈ.ఈ. అడ్వాన్స్ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే బి.అవినాష్ (172 ర్యాంక్), జె.అంజలి(748 ర్యాంక్), సి.హెచ్.వెంకట సాయి పవన్ (4828 ర్యాంక్), బి.ప్రవీణ్ (5609 ర్యాంక్)లను సాధించి విజయఢంకా మోగించడం జరిగింది.ఈ సందర్భంగా స్టెమ్‌స్పార్క్ కాలేజ్ డైరెక్టర్ శ్రీ కొండా శ్రీధర్‌రావు అత్యధిక ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు వారి లక్ష్యాలను సాధించడానికి స్టెమ్‌స్పార్క్ కాలేజ్ ఒక వారధిగా ఉంటుందని తెలియజేసారు.జె.ఈ.ఈ. మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షలలో విజయాలను సాధించి ఐ.ఐ.టి., యన్.ఐ.టి, ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీలలో అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా తక్కువ మంది విద్యార్థులతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని సమకూర్చి నిరంతర పర్యవేక్షణతో అత్యద్భుతమైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని తెలియచేశారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

### శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో

# ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు

లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.



రాజేంద్రనగర్,జూన్ 1(నేటి శుభోదయ):తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశాల ఉత్సవం శంషాబాద్ మండలంలో ఘనంగా నిర్వహించబడిందన్నారు.ఇందులో భాగంగా శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై,లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా రిబ్బన్ కట్ చేసి,సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుల కుటుంబాలకు నూతన గృహాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..”రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందించడం ఎంతో సంతోషకరం.అందరికీ ఇల్లు-సురక్షిత నివాసం’ అనే లక్ష్యంతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు,సొంత గౌరవాన్ని అందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయం. ప్రభుత్వం తోడుగా ఉంటూ ప్రతి



కుటుంబానికి శుభాభినందనలు తెలియజేస్తోంది.” అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు,గ్రామ పెద్దలు,గృహ నిర్మాణ శాఖ అధికారులు,భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.సొంత ఇంటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు,ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620

# ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**జర్నలిస్టులను ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీంలో చేర్చాలి.వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి .ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలో ఫీజు రాయితీ కల్పించాలి.టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య**



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి జూన్ 1:రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానంహైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచి పరిణామని, అదే క్రమంలో ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు కూడా సేకరించి ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య ప్రభూత్వాన్ని కోరారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం అబ్దులాపూర్ మెట్ మండల కేంద్రంలోని వి. వి బ్యాంకెట్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, జిల్లా అధ్యక్ష?్నలు శేరిబాయి గణేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు, కోశాధికారి శ్రీనివాస్ చారి, నేషనల్ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష?్నలు గణేష్ అధ్యక్ష?త వహించారు. ఈ సందర్బంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఫిల్డ్ జర్నలిస్టుల విషయంలో ఎలాంటి కొర్రిలు పెట్టకుండా కార్డులు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీం జాబితాలో జర్నలిస్టులను చేర్చాలన్నారు. ఇండ్ల జాగాల విషయంలో హైదరాబాద్ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇచ్చేందుకు చేస్తున్న ఆలోచనలో భాగంగా ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా జర్నలిస్టుల వివరాలు సేకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరల్నిస్టుల పిల్లల ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఖచ్చితంగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో రాయితీ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు, డీఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేష్, మణికుమార్ , రఘునంధన్ గౌడ్, సుధర్శన్ గౌడ్, శ్రీనివాస్ , నర్సింహ్మ, రాజశేఖర్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ శివ కుమార్ గౌడ్ , జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్ష?, కార్యదర్శులు యాదగిరి, రఘవేందర్ గౌడ్, రాజు, జైచందర్ , శంకర్, బుచ్చయ్య, జర్నలిస్టులు మల్లేష్, యాకుబ్ పాష, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద కుటుంబాల సొంతింటి కలలు సాకారం

: కమిషనర్ అగస్త్య



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక మంది లబ్ధిదారుల సొంతింటి కలలు నెరవేరు తున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారుల నూతన గృహంలో సోమవారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ అగస్త్య నూతన గృహాన్ని సందర్శించి లబ్ధిదారులను అభినందించారు. గృహ నిర్మాణం ఏయే దశల్లో పూర్తయిందో, నిర్మాణానికి ఎంత వ్యయం అయిందో, ప్రభుత్వ సహాయం ఎలా ఉపయోగపడిందో అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి ముందు కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు, ప్రస్తుతం కలుగుతున్న ప్రయోజనాల గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో తాము పాత రేకుల ఇంటిలో నివసించే వారమని, వర్షాకాలంలో ఇంట్లోకి నీరు కారుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారమని తెలిపారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ కుటుంబ సభ్యుల భద్రతపై ఆందోళన ఉండేదని, చిన్నపిల్లలతో చాలా కష్టాలు పడాల్సి వచ్చేదని వివరించారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత పక్కా ఇల్లు లభించడంతో తమ జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎలాంటి వర్షాలు వచ్చినా, గాలులు వీచినా, ఇతర ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నా భయం లేకుండా సురక్షితంగా నివసించగలుగుతున్నామని తెలిపారు. అద్దె ఇంటి భారం లేకుండా, తమ సొంత ఇంటిలో కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ పిల్లలకు మెరుగైన వాతావరణంలో జీవించే అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాల సొంతింటి కలలను సాకారం చేస్తోందన్నారు. గృహం అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, స్థిరమైన భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నగరంలోని అర్హులైన లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను పూర్తి చేసుకొని సొంత ఇంటిలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ఆనందం వ్యక్తమవు తోందని, ఈ పథకం మరెన్నో కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



# మంథని కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వేముల లక్ష్మీ ప్రసాద్




మంథని, మే-01,నేటి శుభోదయ:మంథని సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వేముల లక్ష్మి ప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల జిల్లా అదనపు సెషన్స్ జిల్లా కోర్టు, ఆరవ అదనపు సెషన్స్ కోర్టు మరియు ఏ సి బీ కోర్టు కరీంనగర్ లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా మంథని కోర్టు కి బదిలీపై వచ్చారు. నాలుగు జిల్లాల కరీంనగర్ , పెద్దపల్లి ,జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.వేముల లక్ష్మి ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లది కీలకపాత్రని,పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయశీతో పని చేసినేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు.

# తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపించి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక అన్ని విధాలా అద్భుతంగా అభివృద్ధి చేశారన్నారు.కేసీఆర్ తన పదేళ్ల పాలనలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వడం, ఆర్థిక క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా ముందుకు సాగడంతో తెలంగాణ దేశం మొత్తంమీద అగ్రగామి రాష్ట్రంగా వెలుగొందినదని ఎంపీ రవిచంద్ర చెప్పారు. రాష్ట్రావతరణకు ముందు స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ.5,05,849 కోట్లు కాగా,2023-24 నాటికి రూ.15,01,000 కోట్లకు,తలసరి ఆదాయం రూ.1,12,162 కాగా,3,56,000 రూపాయలకు పెరిగిందని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సామర్థ్యం 2013-14లో 7,778 మెగావాట్లు కాగా,2022-23 నాటికి 18,567 మెగావాట్లకు ,పంటల సాగు విస్తీర్ణం కోటి 31లక్షల ఎకరాలు అయితే,2కోట్ల20లక్షల ఎకరాలకు,పంటల దిగుబడి కోటి 7లక్షల 49వేల మెట్రిక్ టన్నుల నుంచి 4 కోట్ల 65 లక్షల 25వేల మెట్రిక్ టన్నులకు పెరిగినదని ఆయన వివరించారు.తెలంగాణ ప్రాంతంలో 2013-14లో గురుకుల పాఠశాలలు కేవలం 293మాత్రమే ఉండగా, కేసీఆర్ కొత్తగా పెద్ద సంఖ్యలో నెలకొల్పి వీటి సంఖ్యను 1022 లకు పెంచారని,5 మెడికల్ కాలేజీలు ఉంటే 29 కొత్త వాటిని ప్రారంభించడంతో వీటి సంఖ్య 34 కు పెరిగిందని,వీటికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలను కూడా నెలకొల్పారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.రాష్ట్ర ఏర్పాటుకు ముందు ప్రభుత్వాసుపత్రిల్లో 17,000 పడకలు మాత్రమే అందుబాటులో ఉండగా,2022-23 నాటికి రెట్టింపయ్యే 34,000కు చేరుకున్నాయని, ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు 2019-20లో రూ.34,800 కోట్లు కాగా,2023-24 ఆర్థిక సంవత్సరానికి 37,100 కోట్ల రూపాయలకు పెరగడం జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు. ఐటీ ఉత్పత్తుల ఎగుమతులు 2013-14లో రూ.57,000 కోట్లు అయితే,2023-24 నాటికి 2,70,000 కోట్ల రూపాయలకు పెరిగాయని ఆయన తెలిపారు. అలాగే, కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు,ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రిగా కే.టీ.రామారావు కృషితో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తెలంగాణకు తరలివచ్చాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు. అమెజాన్, గూగుల్, క్వాల్కమ్,ఊబర్, ఫేస్బుక్, ఆపిల్,ఫోక్స్ కాన్,మెక్రోసాఫ్ట్ వంటి బహుళజాతి సంస్థలు హైదరాబాద్ లో తమ భారీ ప్రాంగణాలను ప్రారంభించడంతో సుమారు 9 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.ట్రాఫిక్ సజావుగా ముందుకు సాగేందుకు గాను దార్శనికులు కేసీఆర్ హయాంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి,అండర్ పాసులు,ఫ్లైఓవర్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరిగిందన్నారు.హైదరాబాద్ నగరం గొప్పగా అభివృద్ధి చెందడంతో న్యూయార్క్,డల్లాస్, చికాగోలను మరిపించేలా కనిపిస్తున్నదని ప్రముఖ సినీ హీరోలు రజనీకాంత్,సన్నీడియోల్ తదితరులు ప్రశంసించడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.దార్శనికులు కేసీఆర్ కాళేశ్వరం బహుళదశ ప్రాజెక్ట్,మిషన్ కాకతీయ,మిషన్ భగీరథ పథకాల ద్వారా సాగు,తాగునీళ్లకు కొరత లేకుండా చేశారని రామన్ మెగసేసే పురస్కార గ్రహీత రాజేంద్ర సింగ్ కొనియాడడం జరిగిందన్నారు.కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టి ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా రైతులకు పెట్టుబడి సాయం అందించడాన్ని ఐక్యరాజ్యసమితితో పాటు సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ తదితరులు ప్రశంసించడాన్ని ఎంపీ వద్దిరాజు ప్రస్తావించారు. దళితబంధు, రైతుబీమా,అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ పథకాలు ప్రారంభించారని, కాళోజీ నారాయణరావు వైద్యారోగ్య,కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయాలను కేసీఆర్ నెలకొల్పారని తెలిపారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరిట సచివాలయాన్ని,ఆ సమీపానే 125 అడుగుల ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారని, అమరవీరుల స్మారక చిహ్నాన్ని గొప్పగా నిర్మించారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో కలెక్టరేట్స్,ఎస్పీ కార్యాలయాలను అధునాతనంగా నిర్మించడమే కాక జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాల రోడ్లను అభివృద్ధి చేసి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారని వివరించారు. కేసీఆర్ సుపరిపాలన, గొప్పతనాన్ని ఇలాగే చెప్పుకుంటూపోతే చాలా ఉందని,హరితహారం ద్వారా కోట్ల కొద్దీ మొక్కలు నాటించడంతో పచ్చదనం బాగా పెరిగిందని, హన్మకొండలో భారీ టెక్స్ టైల్ పార్క్ నెలకొల్పారని ఎంపీ రవిచంద్ర వివరించారు. యాదగిరిగుట్టను యాదాద్రి దివ్య క్షేత్రంగా అత్యద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్ గొప్ప దైవభక్తులని ఆయన కొనియాడారు.రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ బిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజావాణిలో129 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి,జూన్1(నేటి శుభోదయ):ప్రజావాణిలో (129) ఫిర్యాదులు స్వీకరణ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని,పెండింగులో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం(129) ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు చెందిన (28) దరఖాస్తులు,ఇతర శాఖలకు చెందిన (101) దరఖాస్తులు, మొత్తం (129 )దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ..ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జూన్ 2 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న "పర్యావరణ పరిరక్షణ మరియు అటవీ అవగాహన వారోత్సవాలను"విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులు,సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు."ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక సమర్థవంతమైన వేదిక.ప్రజల వినతులపై అధికారులు స్పందనాత్మకంగా వ్యవహరించి త్వరితగతిన పరిష్కారం చూపాలి.అదే విధంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం,పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి" అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి (రెవెన్యూ),కిరణ్మయి (లోకల్ బాడీస్),వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాల ప్రభుత్వ సేవల అనంతరం ఘన వీడ్కోలు

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్- 11 మంది ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, నేటి శుభోదయ ::: సోమవారం కలెక్టరేట్ లో మే 31, 2026 నాటికి పదవి విరమణ పొందిన 11 మంది ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.గిరిజన సంక్షేమ శాఖలో హెడ్మాస్టర్ గా పనిచేసిన అజ్మీర రాములు, దీటీ శ్రీనివాస్, సోషల్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేసిన శ్యామ్ సుందర్ రావు, కామాటి బోడ బాసు, రెవెన్యూ శాఖలో నాయబ్ తహసిల్దార్ గా పని చేసిన సయ్యద్ రెహ్మాన్, పశుసంవర్ధక శాఖ పరిధిలో లైవ్ స్టాక్ అధికారిగా పని చేసిన ఎన్.రాంబాబు, సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో ఎంఎన్ఓ గా పని చేసిన రామ చంద్రరావు, పంచాయతీ శాఖలోని పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటరమణ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ లో కార్యాలయ సపోర్టుగా పనిచేసిన ఫాతిమా, సెరికల్చర్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ గా పని చేసిన ముత్యాలు అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసిన రేణు శర్మ పదవి విరమణ వేడుకలు బాగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలు నిర్విరామంగా అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు , సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అనంతరం పదవి విరమణ పొందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# మాణిక్యమ్మ గూడా లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేఎల్ఆర్, సిహెచ్ యాదయ్య



( నేటి శుభోదయ మహేశ్వరం జూన్ 01:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని మణికమ్మ గూడ గ్రామంలో.... ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో మరియు గృహప్రవేశ కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండలం కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.పేదలకు గూడు కల్పించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నుండి పూర్తి సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో మాణిక్యమ్మ గూడా సర్పంచ్ తెలంగాణ పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నపల్లి పద్మకృష్ణ గ్రామ శాఖ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి అంకం శ్రీనివాస్ యాదవ్ దాసు దావీద్ మహేందర్ కృష్ణయ్య మండల స్థాయి నాయకులు గ్రామ సర్పంచ్లు వాట్స్అప్లో ముఖ్య కార్యకర్తలు మరియు నాయకులు పెద్ద ఎత్తున ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నట్టుగా తెలియజేశారు

# నేల ఆరోగ్యం పై పంట వ్యర్థాలను కాల్చడం వల్ల రైతులకు భారీ నష్టం.

**-యాచారం మండలం వ్యవసాయ అధికారి రవినాథ్.**



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి జూన్ 1:యాచారం మండలం పరిధిలోని రైతులకు అవగాహన పద్ధతులు పంట కోత తర్వాత పొలంలో మిగిలిపోయిన వరి, మొక్కజొన్న గడ్డి వంటి పంట అవశేషాలను తగలబెట్టడాన్నే పంట వ్యర్థాలను కాల్చడం అంటారు. ఇది పొలాలను త్వరగా శుభ్రం చేయడానికి ఒక మార్గం అయినప్పటికీ, నేల ఆరోగ్యం మరియు పర్యావరణంపై దీనికి అనేక హానికరమైన ప్రభావాలు ఉన్నాయి. నేల ఆరోగ్యంపై ప్రధాన ప్రభావాలు -సేంద్రియ పదార్థం నష్టం కాల్చడం వల్ల పంట వ్యర్థాలలో ఉండే విలువైన సేంద్రియ కార్బన్ నశిస్తుంది. నేలలోని సేంద్రియ పదార్థం వీటికి అవసరం: నేల సారవంతం నీటి నిలుపుదల మంచి నేల నిర్మాణం సూక్ష్మజీవుల కార్యకలాపాలు ఫలితం: నేల సారహీనంగా మారి, క్షీణతకు ఎక్కువగా గురవుతుంది.-ప్రయోజనకరమైన సూక్ష్మజీవుల నాశనం కాల్చడం వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు వీటిని చంపుతాయి: ప్రయోజనకరమైన బ్యాక్టీరియా శిలీంధ్రాలు వానపాములు ఇతర నేల జీవులు ఈ జీవులు వీటికి సహాయపడతాయి: పోషకాల చక్రం నత్రజని స్థాపన సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నం ఫలితం: జీవ కార్యకలాపాలు తగ్గి, నేల ఉత్పాదకత క్షీణిస్తుంది.-పోషకాల నష్టం కాల్చడం వల్ల ప్రధాన పోషకాల నష్టం జరుగుతుంది: నత్రజని (ఎన్) ఎక్కువగా వాతావరణంలోకి ఆవిరైపోతుంది గంధకం (ఎస్) ? వాయువుల రూపంలో నష్టపోతుంది ఫాస్ఫరస్ (పి) మరియు పొటాషియం (కె) పాక్షికంగా నష్టపోతాయి దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం పెరుగుతుంది.-నేల నిర్మాణంలో క్షీణత పదేపదే కాల్చడం వల్ల: నేల కణాల కలయిక తగ్గుతుంది నేల గట్టిగా, కుదించుకుపోతుంది కోత ప్రమాదం పెరుగుతుంది ఫలితం: వేర్ల పెరుగుదల సరిగా ఉండదు మరియు నీరు భూమిలోకి ఇంకడం తగ్గుతుంది.-తేమ నిలుపుదల తగ్గడం పంట అవశేషాలు సాధారణంగా మల్చ్‌గా పనిచేసి తేమను నిల్వ చేస్తాయి. కాల్చిన తర్వాత: నేల త్వరగా ఆరిపోతుంది బాష్పీభవనం పెరుగుతుంది నీటిపారుదల అవసరం పెరుగుతుంది.-నేల ఉష్ణోగ్రత పెరగడం కాల్చిన పొలాలలో తరచుగా ఇవి జరుగుతాయి: ఆకస్మిక ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు నేల ఉపరితల జీవావరణానికి నష్టం ఇది విత్తనాల మొలక మరియు వేర్ల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పర్యావరణ ప్రభావాలు పంట గడ్డి కాల్చడం వల్ల ఈ క్రిందివి కూడా కలుగుతాయి: వాయు కాలుష్యం పొగమంచు ఏర్పడటం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు మానవ శ్వాసకోశ సమస్యలు విడుదలయ్యే ప్రధాన వాయువులు: కార్బన్ డయాక్సైడ్ (సి ఓ2) మీథేన్ (సి హెచ్4) నైట్రస్ ఆక్సైడ్ (ఎన్ 2 ఓ) పంట గడ్డి కాల్చడానికి మెరుగైన ప్రత్యామ్నాయాలు సుస్థిరమైన పంట అవశేషాల నిర్వహణ పద్ధతులు మల్చింగ్ పంట అవశేషాలను పొలం ఉపరితలంపైనే వదిలివేయండి. కంపోస్టింగ్ పంట అవశేషాలను సేంద్రియ ఎరువుగా మార్చండి. మట్టిలో కలపడం సేంద్రియ పదార్థాన్ని మెరుగుపరచడానికి పంట అవశేషాలను మట్టిలో కలపండి. హ్యాపీ సీడర్ / సూపర్ సీడర్ వాడకం పంట అవశేషాలను కాల్చకుండా విత్తనాలు వేయడానికి అనుమతిస్తుంది. బయో-డీకంపోజర్ స్ప్రేలు పంట అవశేషాల కుళ్ళిపోవడాన్ని సహజంగా వేగవంతం చేస్తాయి. ముగింపు పంట గడ్డి కాల్చడం స్వల్పకాలంలో సమయం మరియు శ్రమను ఆదా చేసినప్పటికీ, ఇది నేల సారవంతాన్ని, సూక్ష్మజీవుల జీవితాన్ని మరియు దీర్ఘకాలిక వ్యవసాయ సుస్థిరతను తీవ్రంగా దెబ్బతీస్తుంది.పంట అవశేషాల నిర్వహణ పద్ధతులను పాటించడం వల్ల నేల ఆరోగ్యం, పంట ఉత్పాదకత మరియు పర్యావరణ నాణ్యత మెరుగుపడతాయి.అలాగే పంట అవశేషాలు కాల్చడం చట్ట ప్రకారం నేరం.

## వివో ఏ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

వి వోఏ ల 11వ రోజు రిలే దీక్షలకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు



తిరుమలాయపాలెం, నేటి శుభోదయ ::: వివోఏల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని 11వ రోజు రిలే నిరాహార దీక్షలకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న మండల కేంద్రంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష 11వ రోజును ఉద్దేశించి వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా సాధికారత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీవోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న వీవోఏల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.వీవోఏ ల ను సెర్ప్ ఉద్యోగస్తులుగా అధికారికంగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకొని వీవోఏలకు నెలకు రూ.26,000 గౌరవ వేతనం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.సుదీర్ఘకాలంగా వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని విమర్శించారు. వెంటనే వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరారు. వీవోఏల న్యాయమైన హక్కుల సాధన కోసం జరుగుతున్న ఈ పోరాటానికి సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ అండగా నిలుస్తుందని, ఉద్యమానికి పూర్తి సంఘీభావం తెలుపుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అచ్చ ఉప్పలయ్య, పుల్లయ్య, పోలే పొంగు నాగయ్య, మల్సూర్, సైదులు, కొమరయ్య, వివోఏ ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా, పోలిశెట్టి అరుణ, మేకల కృష్ణవేణి, బొడ్డు కుసుమ,గోపోజి ఉపేంద్ర, పోలూరి విజయలక్ష్మి, మండాది కళమ్మ , గుంటి ధనలక్ష్మి, సామినేని కరుణ, గద్దల జ్యోతి, లలిత, మంజుల, రమణ మరియమ్మ శ్రీలత సువర్ణ ఉపేంద్ర పద్మ రాంబాయి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత భక్తి శ్రద్ధలతో,వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా హిందూ సమ్మేళనం



రాజేంద్ర నగర్,జూన్01(నేటి శుభోదయ):అత్తాపూర్ సర్కిల్,మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ శ్రీ రామకృష్ణ హైస్కూల్ సర్కిల్ వద్ద నిర్వహించిన హిందూ సమ్మేళనం అంగరంగ వైభవంగా,అత్యంత భక్తి శ్రద్ధలతో,వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది.హిందూ ధర్మ పరిరక్షణ,భారతీయ సంస్కృతి పరిరక్షణ,యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడం,సమాజంలో ఐక్యత,సామరస్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ మహాసమ్మేళనం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.ఉదయం 8 గంటలకు ప్రారంభమైన భారీ ర్యాలీలో మహిళలు,యువకులు, చిన్నారులు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.భగవధ్వజాలు,జై శ్రీరామ్ నినాదాలు, దేశభక్తి గీతాలు,భక్తి గీతాలతో మధుబన్ పరిసర ప్రాంతాలు ధర్మచైతన్యంతో మార్మోగాయి.హిందూ సమాజ ఐక్యతకు ప్రతీకగా సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో విశేష ఉత్సాహాన్ని నింపింది.సాయంత్రం 6 గంటలకు నిర్వహించిన హిందూ సమ్మేళన సభలో ముఖ్య అతిథులుగా పూజ్య శ్రీ శ్రీ శ్రీ దుర్గానందపురి స్వామీజీ, శ్రీమత్ అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠాధిపతులు,విశ్వహిందు మాస పత్రిక సంపాదకులు ఆచార్య కాసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని ఆధ్యాత్మిక,సాంస్కృతిక,జాతీయ భావజాలంపై ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు.ఈ సందర్భంగా పూజ్య శ్రీ శ్రీ శ్రీ దుర్గానందపురి స్వామీజీ మాట్లాడుతూ..ధర్మాన్ని రక్షించడం అంటే కేవలం ఆచారాలను కాపాడుకోవడం కాదు,మన సంస్కృతి,సంప్రదాయాలు,విలువలు,జాతి గౌరవాన్ని పరిరక్షించడం. సమాజంలో ఐక్యత, సేవాభావం,దేశభక్తి పెరిగినప్పుడే బలమైన భారతదేశం నిర్మితమవుతుంది అని అన్నారు.ఆచార్య కాసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ..భారతీయ సంస్కృతి ప్రపంచానికి మార్గదర్శకమని,యువత తమ మూలాలను గుర్తుంచుకొని ధర్మం,సంస్కృతి,జాతీయత పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ మహాసమ్మేళనంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



చిన్నారులు,యువత ప్రదర్శించిన భక్తి నృత్యాలు, దేశభక్తి గేయాలు,ప్రతిబింబించే నాటికలు,భారతీయ సంస్కృతిని చాటిచెప్పే కళాప్రదర్శనలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రతి ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి ఘన స్పందన లభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు హిందూ సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తూ కార్యక్రమానికి మరింత శోభను తీసుకు వచ్చాయి.కమిటీ అధ్యక్షులు బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..హిందూ సమాజంలో ఐక్యత,సేవా భావం,సంస్కృతి పరిరక్షణ,యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.సమాజ హితం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయడంలో కమిటీ అధ్యక్షులు బొల్లా శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి దానోజు శ్రీనివాస్,కోశాధికారి అడికే కిషోర్ కుమార్,ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి,సీతారాం పాండు,దొంత రాజు,జాయింట్ సెక్రటరీలు ఉత్తమ్,బాలస్వామి,రాజవర్ధన్ రెడ్డి,లక్ష్మణ్, ఉప కోశాధికారి చైతన్య,ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గంజి వెంకటేష్, ఏలప్ప,సతీష్,మీడియా కోఆర్డినేటర్లు నంద కిషోర్,విజయ్,కల్చరల్ కోఆర్డినేటర్లు లక్ష్మి,గాయత్రీ,సలహాదారులు మసున వెంకటేష్,మునిగిపాటి చంద్రయ్య,కాశీగారి యాదగిరి,గోవింద్ రాజ్,సామల యాదయ్య,మహిపాల్,పోశెట్టి,మొగిలి కృష్ణతో పాటు వందలాది మంది స్వచ్ఛంద సేవకులు అహర్నిశలు శ్రమించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గూడు కట్టుకున్న సంతోషం- ఇందిరమ్మ గృహా ప్రవేశాలు



నేలకొండపల్లి, నేటి శుభోదయ ::: గతేడాది ఫిబ్రవరి లో శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతి చాటుకుంది. మండలం లోని తొలి విడత 450 ఇళ్లు మంజూరు కాగా ఎట్టకేలకు ఇళ్ల ను నిర్మించుకున్నారు. మండలం లోని మంగాపురంతండా, మోటాపురం తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల గృహా ప్రవేశాల ను సోమవారం నిర్వహించారు. ఇంటి ని నిర్మించుకున్న లబ్ధిదారులలో గృహా ప్రవేశాల సందర్భంగా సంబురంలో పాల్గొన్నారు. సొంతింటి కల నెరవేరిందని పేదింట సంతోషంలో పాలుపంచుకున్నారు. మంగాపురంతండా సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి చేతుల మీదుగా గృహా ప్రవేశాల కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గోబ్రియా తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవదని కలెక్టర్ కు ఫిర్యాదు

రంగారెడ్డి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంట్లవెల్లి రాకేష్.



రంగారెడ్డి, జూన్ 01(నేటి శుభోదయ):బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ,ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసి సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ విషయంపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది ప్రభుత్వం



తీసుకొస్తున్న ఈ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే విశారదన్ మహరాజ్ నాయకత్వంలో భారీ ధర్నా కార్యక్రమం తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంట్లవెల్లి రాకేష్,జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భవాని శేఖర్,స్టాలిన్ రవీంద్ర మహారాజ్,నరసింహ,రాము,శివ,నరేష్,నవీన్,రాఘవేందర్,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 148 ఫిర్యాదులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ జూన్ 01 నేటి శుభోదయ :ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 148 ఫిర్యాదులు అందాయి.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్,భుజంగరావు,డీఆర్ఓ గీత,జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,డీపీఓ శ్రీనివాస్,డీఆర్డీఓ సాయన్న,బోధన్ ఏసీపీ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు ప్రతి ఒక్కరికి పథకాలు చేరే విధంగా నాయకులు పనిచేయాలి కెఎల్ఆర్

గంగారం మైలార్ బై తండా లో ఇంద్రమ్మ గృహప్రవేశంలో ముఖ్యఅతిథిగా కేఎల్ఆర్



( నేటి శుభోదయ మహేశ్వరం జూన్ 01:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో మైలర్ బాయ్ తండా నూతన ఇందిరమ్మ గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నేనోవత్ భారతి సోమల నాయక్ ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించడం జరిగింది మహేశ్వరం మండల కేంద్రంలో గంగారం గ్రామపంచాయతీకి ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువ మంజూరు అయినందున కే ఎల్ ఆర్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు రంగారెడ్డి జిల్లాలోని గంగారం గ్రామపంచాయతీ మొదటి స్థానంలో ఉంటుందని కె ఎల్ ఆర్ చెప్పడం జరిగిందన్నారు రెండో విడత ఇందిరమ్మ 20 ఇండ్లు మంజూరైనట్టుగా తెలియజేస్తూ కొత్తగా కట్టుకునేవారు తెలియజేయాలని సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలియజేశారు గత పాలకులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం దళితులకు 10 లక్షలు ఏస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారని ప్రజాక్షేత్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదోళ్లకు ప్రతి ఒక్క పథకాలు ప్రజలకు చేరే విధంగా నాయకులు పని చేస్తున్నారని గంగారం గ్రామపంచాయతీకి సుమారు 9 కోట్లు వివిధ పథకాల ద్వారా ప్రజలకు చేరిందని కే ఎల్ ఆర్ ఆధ్వర్యంలో.. గంగారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలుగు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మహేందర్ కాకి ఈశ్వర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లికుమార్ కరుణాకర్ రెడ్డి రాఘవేందర్ తదితరులు యొక్క కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నట్టు తెలియజేశారు

## పురుషోత్తపట్నం దేవాదాయ శాఖ భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : సబ్ కలెక్టర్




చింతూరు, నేటి శుభోదయ ::: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఎండోమెంట్ అధికారి (ఈఓ), చింతూరు సబ్ కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి, ఎటపాక మండలంలోని పురుషోత్తపట్నం గ్రామ పరిధిలో ఉన్న దేవాదాయ శాఖ భూములకు సంబంధించిన వివిధ అంశాలపై సవివరంగా చర్చించారు.ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన భూములలో కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు వెలసినట్లు, అలాగే భూముల యాజమాన్యం, పరిరక్షణ, నిర్వహణకు సంబంధించిన పలు పరిపాలనా, భూవివాద సమస్యలు ఉన్నట్లు ఎండోమెంట్స్ అధికారి, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్, దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన అన్ని సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ, ఎండోమెంట్స్, ఇతర శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని రాబోయే పది రోజులలో ఏర్పాటు చేసి, ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యలను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.అలాగే స్థానిక ప్రజలు, సంబంధిత వర్గాలు, దేవాదాయ శాఖ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, పరస్పర సహకారంతో భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రజలు శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ జూన్ 01 నేటి శుభోదయ :తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను అన్ని విధాలుగా ముస్తాబు చేశారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్,భుజంగరావు,డీ.ఆర్.ఓ గీత ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 8.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.అంతకుముందు వినాయకనగర్ లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ముఖ్య అతిథితో పాటు ప్రజాప్రతినిధులు,అధికారులు శ్రద్ధాంజలి ఘటించనున్నారు.రాష్ట్ర అవతరణ వేడుకలలో లోటుపాట్లకు తావులేకుండా,పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.ప్రభుత్వం అట్టహాసంగా ఈ వేడుకలను చేపడుతున్న నేపథ్యంలో మరింత విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ం

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల వికాసం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో



### ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు.. లబ్ధిదారుల హర్షం...

షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి జూన్ 01 : కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చింది.. ఇల్లు ఇచ్చింది.. పేదల ముఖంలో ఆనందం నింపింది కాంగ్రెస్ ప్రభుత్వం అని షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ?సోమవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 15వ వార్డుల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కూలిపోయే గుడిసెల నుండి పేదలను విముక్తులను చేసి, వారికి ఆత్మగౌరవ ప్రతీకగా పక్కా ఇళ్లను అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ మార్క్ సంక్షేమానికి నిదర్శనమన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.



లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం:

సొంత ఇంటి కల నిజమవ్వడంతో లబ్ధిదారులు నాగులపల్లి లక్ష్మి, శభానాబేగంలు భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేక పడిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ, తమకు పక్కా ఇల్లు అందించి ఆదుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, స్థానిక కౌన్సిలర్లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ గృహప్రవేశాల మహోత్సవంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, స్థానిక కౌన్సిలర్లు దిలీప్ కుమార్, మరియం సాధిక్, అప్పి, కొప్పునూరి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఇబ్రహీం, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ముబారక్, మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.




## బియ్యం గోదాములను-తనిఖీ చేసిన ఆర్డీవో..!!

హనుమకొండ జిల్లా ప్రతినిధి (మౌళి ఆర్షం) నేటిశుభోదయ( జూన్ 1); హనుమకొండ జిల్లా పరకాల రెవెన్యూ డివిజన్ అధికారి డి. ఎస్. వెంకన్న (ఆర్డీవో)పౌరసరఫరాల బియ్యం గోదాములను సోమవారం పరకాలలో తనిఖీ చేశారు. బియ్యం సక్రమంగా గ్రామాలకు సకాలంలో రవాణా అవుతుందా.. గ్రామాలకు అలాట్మెంట్ సన్న బియ్యం తదితర విషయాలపై ఆర్డిఓ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలంలో బియ్యం గోదాములలో సక్రమంగా నిల్వ చేయాలని, బయట తడవనీయకుండా

# నాపై 39 కేసులు పెట్టారు : మోతిలాల్ నాయక్

**--ఉద్యమకారుడుగా జాబితాలో చేర్చండి కలెక్టర్ కు వినతి:**



వరంగల్ ప్రతినిధి జూన్ 01 (నేటి శుభోదయ)ఉద్యమకారుల గుర్తింపు మరియు వారి త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం డా. కె. కేశవరావు అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా..తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిజమైన అసలైన ఉద్యమకారులను గుర్తించాలని వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు భూక్య మోతిలాల్ నాయక్ కోరారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో కారుడిగా గుర్తించాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో 2001 నుంచి రాష్ట్ర అవతరణ వరకు ఉద్యమ సమయంలో నాపై 39 కేసులు నమోదైనట్లు చెప్పారు. తనను ఉద్యమకారుడుగా గుర్తించాలని కలెక్టర్ ను ఆయన కోరారు. అర్హులకు గుర్తింపు ఇవ్వండి:మొదటి, మలి దశ ఉద్యమాలలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించినవారు, పోలీసు కేసులు నమోదైనవారు, అమరవీరుల కుటుంబాలు, విద్యార్థులు, జర్నలిస్టులు, ఆర్టీసీ మరియు సింగరేణి కార్మికులను గుర్తించి జాబితా తయారు చేసి నిజమైన ఉద్యమ కారులను జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు

# ఆంగ్లంతోనే భవిష్యత్
# లెట్స్‌టాక్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బి.జ్యోతి వెల్లడి

**నగరంలో ఔట్‌డోర్ సెమినార్ విజయవంతం**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ జూన్ 01 నేటి శుభోదయ :విద్యార్థులు,ఉద్యోగస్తులు ఆంగ్లంలో ప్రావీణ్యం ఉంటేనే భవిష్యత్తులో రాణిస్తారని లెట్స్‌టాక్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బి.జ్యోతిభాస్కర్ వెల్లడించారు.ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని శివాజీనగర్‌లో గల మున్నూరుకాపు కళ్యాణమండపంలో ఔట్‌డోర్ సెమినార్ నిర్వహించారు.విద్యార్థులు నాలుగు గోడల మధ్య కాకుండా వంద మందిలో విశ్వాసంగా మాట్లాడాలని,అప్పుడే అన్ని రంగాల్లో అన్ని చోట్ల రాణిస్తారని తెలిపారు.నగరంలోని ఆ సంస్థకు ఉన్న మూడు బ్రాంచ్‌లలో వేసవి సెలవుల్లో స్పొకేన్ ఇంగ్లీష్,ఫోనిక్స్ తరగతులు నిర్వహించారు.వేసవి క్యాంపు ముగిసిన సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించేందుకు మూడు బ్రాంచ్‌లలోని విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్‌లో ఒక్కో విద్యార్థి ఒక్కో అంశంపై కనీసం మూడు నిమిషాల పాటు మాట్లాడాల్సి ఉంటుంది.ఏ విద్యార్థి గ్రామర్ తప్పులు లేకుండా విశ్వాసంగా మాట్లాడతారో ఆ విద్యార్థులను విజేతలుగా ప్రకటించి మెమెంటో ప్రధానం చేశామని తెలిపారు.ఈ సెమినార్‌కు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరయ్యారని వివరించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఇంగ్లీష్ చదవడం,రాయడం రాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో తరగతులు బోధిస్తున్నామని ఆమె తెలిపారు.గడిచిన ఎనిమిది సంవత్సరాల్లో లెట్స్ టాక్ ఇనిస్టిట్యూట్ నిజామాబాద్ పట్టణంలోనే మూడు బ్రాంచులతో ముందుకు సాగుతుందని వివరించారు.ఈ సంవత్సరం మంచి నాణ్యమైన విద్య అందించేందుకు ది విద్యార్థి స్కూల్‌తో ముందుకు వస్తున్నామని,తల్లిదండ్రులు ఆదరించాలని ఆమె కోరారు.

# పాగి మార్తమ్మ మృతి పట్ల సంతాపం



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన పాగి వెంకన్న మాతృమూర్తి పాగి మార్తమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, తెలంగాణ శ్రీను, తెలంగాణ సంస్కృతి సారథులు కళాకారులు బాలు కంపల్లి, బొమ్మరి ముత్యం, బండ వెంకన్న, స్నేహ గిరిజ, మీడియా మిత్రులు సంపత్, విబి చారి తదితరులు పాల్గొని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.పాగి మార్తమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఘన నివాళులు అర్పించారు. ఆమె మృతి పట్ల సంతాపం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# విద్యుత్ ప్రమాదాలుం
# జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు

**మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్**



మంథని, జూన్-01,నేటి శుభోదయ: మంథని మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు చేపట్టిన పనులను సోమవారం మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ మారుపాక నిహారిక మరియు మున్సిపల్ కమిషనర్ ఎన్ . మనోహర్ తో కలిసి పాత విద్యుత్ పరికరాలు, శిథిలావస్థలో ఉన్న ఇనుప స్థంభాలు, ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి సురక్షిత ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సంబంధిత ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అలాగే మంథని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు శ్రీ ఎల్లంకి వంశీధర్ గారు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు వంగల వెంకట నారాయణ (ఏ డి ), కోడూరి సాయి (ఏఈ ) మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎంతో మంది త్యాగధనులు,
# ఉద్యమ కారులను అందించిన ఘనచరిత్ర ఎఐఎస్ఎఫ్‌దీ

**"ఎగసిన ఉద్యమ తరంగం ఎఐఎస్ఎఫ్"పుస్తకావిష్కరణలో పలువురు నేతలు.**





హైదరాబాద్,జూన్1(నేటి శుభోదయ):ఎంతో మంది త్యాగధనులు,ఉద్యమ కారులను ఈ దేశానికి అందించిన గొప్ప చరిత్ర అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్)దని పలువురు వ్యక్తులు అన్నారు.విద్యార్థుల హక్కుల కోసం తృణ ప్రాయంగా తమ ప్రాణాలను అర్పించిన ఆత్యాగధనుల విలువలను, వారి ఆలోచనలను,వారికి ఉన్న నిబద్ధత భవిష్యత్ తరతరాలకు అందించాల్సి అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పి.శ్రీనివాస్ నాయుడు తన దశాబ్దకాల స్వీయ అనుభావాలతో రాసిన "ఎగసిన ఉద్యమ తరంగం ఎఐఎస్ఎఫ్ " అనే పుస్తకాన్ని ఈ సభలో కేరళం సిపిఐ కార్యదర్శి, మాజీ మంత్రి బినయ్ విశ్వం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి,సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ల పల్లి శ్రీనివాస్ రావు,సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా,సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి,బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపి బి.వినోద్ కుమార్,ఎఐటియుసి సీనియర్ నాయకురాలు బి.వి.విజయలక్ష్మి,ఎఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి,ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్,ఆంధ్రప్రదేశ్ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల వలరాజు,ప్రధాన కార్యదర్శి నాసర్జీ పుస్తక రచయిత పి.శ్రీనివాసు నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బినయ్ విశ్వం మాట్లాడుతూ..ఈ దేశంలో విద్య, జ్ఞానం కం డబ్బుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని, ఇది మన పూర్వీకులు పోరాడిన భారతదేశం కాదనిఆవేదన వ్యక్తం చేశారు.న్యాయం,సమానత్వం,స్వేచ్ఛ,జ్ఞానం వంటి విలువలే మన భవిష్యత్తుకు పునాది అని ఆ విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఎఐఎస్ఎఫ్ విలువలు తరతరాలకు కొనసాగుతాయని విశ్వసిస్తునన్నారు.వివిధ ప్రాంతాల నుంచి,వివిధ వృత్తుల నుంచి వచ్చిన మనమందరినీ ఒకే బంధం కలుపుతోందని,అది ఎఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ1936 ఆగస్టులో ఆవిర్భావించిన ఎఐఎస్ఎఫ్ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమేకాకుండా ఎంతో మంది గొప్ప గొప్ప వ్యక్తులను అందించిన ఘన చరిత్ర ఉందన్నారు.విద్యా వ్యవస్థ, విద్యార్థి సంఘాలు ప్రగతిశీలంగా ఉన్నప్పుడే దేశంలో మేధావంతులతో కూడిన దేశంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.అయితే పాలకులు విద్యార్థి సంఘాలను ఎన్నికలు నిర్వహించకుండా కుట్రలు పన్నారని విమర్శించారు.గతంలో తరహాలో మిలిటెంట్ ఉద్యమాలకు సిపిఐ సన్నద్దం అవుతోందని పేర్కొన్నారు.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..పుస్తక రచయిత శ్రీనివాస్ నాయుడు అనంతపురం జిల్లా నుంచి విద్యార్థి నాయకుడుగా వచ్చి రంగారెడ్డి జిల్లాలో రాజకీయ నాయకుడికి ఎదిగరని పేర్కొన్నారు.ఉద్యమం ఎక్కడా ప్రారంభించాలో,దానిని ఎప్పుడు ముగించాలో బాగా తెలిసిన నాయకుడని ప్రశంసించారు.బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు కొత్త రకం సమస్యలను ఎదుర్కొంటున్నారని,వాటి పరిష్కారానికి ప్రగతిశీల భావాలు కల్గిన నేతలందరూ ఆలోచనలు చేయాల్సి అవసరముందని పేర్కొన్నారు.కె.రామకృష్ణ మాట్లాడుతూ..ఎఐఎస్ఎఫ్ ఎంతో మంది నాయకులకు భవిష్యత్‌ను ఇచ్చిందన్నారు.పుస్తక రచయిత శ్రీనివాస్ నాయుడు గాని,తను కానిరోజు ఈ స్థాయిలో ఉండడానికి ఎఐఎస్ఎఫ్ అని తెలిపారు.అజీజ్ పాషా మాట్లాడుతూ..ఎఐఎస్ఎఫ్ కోసం ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు.నాడు ఎఐఎస్ఎఫ్ నాయకులు చేసిన పోరాటాలను ఆయన వివరించారు.ఈకార్యక్రమంలో తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పాల్గొన్నారు.

# కొత్తూరులో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

**లబ్ధిదారులకు గృహప్రవేశం చేయించిన కాంగ్రెస్ నేతలు**

**నిరుపేదల కుటుంబాలకు వరంగా ఇందిరమ్మ ఇళ్లు: జాండాగూడెం సుదర్శన్ గౌడ్**

**మున్సిపాలిటీ లో మొత్తం నాలుగు ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం**



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి జూన్ 01 : షాద్నగర్ నియోజకవర్గం పరిధిలో కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా జరిగింది. మండలంలో నూతనంగా నిర్మించిన మూడు ఇందిరమ్మ ఇళ్లను కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాండాగూడెం సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ బాలాజీతో కలిసి అధికారికంగా ప్రారంభించారు.రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించిన అనంతరం, లబ్ధిదారులతో సాంప్రదాయబద్ధంగా గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున లబ్ధిదారులకు ఆడపడుచుల వలే 'చీర సారె' అందించి, ప్రత్యేకంగా సత్కరించారు. నిరుపేదల సొంతింటి కల సాకారం కావడం పట్ల లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాండాగూడెం సుదర్శన్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూరుస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు అన్ని వసతులతో కూడిన గృహాలను అందించేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ సంబరాల్లో వీరమోని దేవేందర్ ముదిరాజ్, ఏనుగు జనార్ధన్, కర్రోళ్ళ సురేందర్, పాశం కృష్ణ, నర్సింహా గౌడ్, సీహెచ్ సురేష్, గానిభాయ్,జగన్, శివశంకర్ గౌడ్,మంగలి శ్రీను,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొని లబ్ధిదారులకు శు భాకాంక్షలు తెలియజేశారు.

# పేదలకు సొంతింటి కల సహకారం

**పేదవారి ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇల్లు:సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం,**



**రాజేంద్ర నగర్,జూన్01(నేటి శుభోదయ):శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో గృహప్రవేశ కార్యక్రమానికి చౌదరిగూడ గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం హాజరై ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇల్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారుల నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.**

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణ సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు**

**- ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**- పులిగుండాల ఎకో టూరిజం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నివారణ పోస్టర్ లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**




ఖమ్మం, నేటి శుభోదయ ::: పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి ప్రకృతి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్,అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి పులిగుండల ఎకో టూరిజం ప్రాజెక్టు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నివారణ పోస్టర్ లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జూన్ 1 నుంచి జూన్ 12 వరకు



పర్యావరణ సంరక్షణ అంశంపై జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్రకృతిని సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించగల మన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని, పూర్తి స్థాయిలో నిరోధించేందుకు అందరూ సహకరించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని తెలిపారు. మొక్కలను కాపాడితేనే భవిష్యత్ తరాల జీవనం మెరుగ్గా ఉంటుందని, నేడు పర్యావరణ పరిరక్షణలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించరని అన్నారు. జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కార్యాలయ సిబ్బంది, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ ప్రజలకు మహేష్ బాబు అభిమానుల మద్దతు

**ఆల్ ఇండియా కృష్ణ ,మహేష్ సేన అధ్యక్షుడు ఖాదర్ గోరి తో మాట్లాడిన జర్నలిస్ట్ కేపీ.. మహేష్ అభిమానుల మద్దతు ఉంటుందని ప్రకటించిన గోరి..**

**ఈ విషయంలో మహేష్ బాబు తో మాట్లాడుతానని హామీ**




షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి జూన్ 01 : షాద్నగర్ నియోజకవర్గం పరిధిలో కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో డంపు యార్డ్ ఏర్పాటు విషయంలో దాదాపు నెల రోజులుగా గ్రామస్తులు మూకుమ్మడిగా పోరాడుతున్నారు. మూడు మండలాల ప్రజలు సిద్దాపూర్ లో డంప్ యార్డు వద్దంటూ ముక్తకంఠంతో ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా వారికి మద్దతుగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులను కలిసి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీ సరస్వతి కళా పీఠం ఏర్పాటు చేసిన సూపర్ స్టార్ కృష్ణ జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ ఇండియా కృష్ణ మహేష్ ప్రజాసేన అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరిని షాద్ నగర్ జర్నలిస్ట్ కేపీ సిద్దాపూర్ డంపు యార్డ్ వ్యవహారం పట్టించుకోవాలని కోరారు. ఆ గ్రామాన్ని గతంలో మహేష్ బాబు దత్తత తీసుకున్నారని, అలాంటి గ్రామం ప్రస్తుతం ఎకో టౌన్ సమస్యతో పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. మహేష్ బాబు తో ప్రత్యేకంగా మాట్లాడి ఈ సమస్య సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని ఈ సందర్భంగా జర్నలిస్టు కేపి వేదిక పైనుంచి ఖాదర్ గోరిను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ తప్పనిసరిగా ఈ పోరాటంలో మహేష్ బాబు అభిమానులు కూడా భాగస్వాములు అవుతారని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా ఈ వ్యవహారాన్ని మహేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లి తద్వారా సమస్య సీఎం దృష్టికి వెళ్లేలా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. సంగీత్ ఉత్సవంలో ఈ సామాజిక అంశం ఆసక్తిని కలిగించింది.

# సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం..

**లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవు**



కేశంపేట, నేటి శుభోదయ:ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం కింద కేశంపేట మండలం బోదునంపల్లి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పిచ్చకుంట్ల పద్మమ్మ, పిచ్చకుంట్ల యాదమ్మలకు మంజూరైన నూతన గృహాలను గ్రామ సర్పంచ్ నాగేశ్వర్ ప్రారంభించారు. సొంత ఇంటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి సాయికుమార్ రెడ్డి, ఈజీఎస్ టీఏ శ్రీనివాస్‌తో పాటు పలువురు గ్రామస్తులు, ఇతర లబ్ధిదారులు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు గృహాలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన నివాసం కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమం అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



# కుష్ మహల్ వద్ద ఏర్పాట్లను పరిశీలన

ట్రాఫిక్ అదనపు డిసిపి .



వరంగల్ ప్రతినిధి, జూన్ 01 (నేటి శుభోదయ) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వరంగల్ కోటలోని చారిత్రక కుష్ మహల్ వద్ద అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం జరగనున్న ఈ అధికారిక వేడుకలకు సంబంధించిన భద్రత, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లను మరియు ప్రాంగణం, జెండా ఆవిష్కరణ స్థలం, పోలీస్ పరేడ్ గ్రౌండ్, విద్యుత్తు, పారిశుద్ధ్య సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మరియు వివిధ రంగాల ప్రముఖులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండటం కోసం పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి వాహనాల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ డైవర్షన్లు మరియు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సిబ్బందికి కీలక ఆదేశాలు:కార్యక్రమం ముగిసే వరకు ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడాలని, ఎక్కడా వాహనాలు నిలిచిపోకుండా క్లియరెన్స్ చర్యలు చేపట్టాలని అదనపు డీసీపీ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. చారిత్రక పరిసరాల్లో జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని ఆయన పేర్కొన్నారు..

# సీఎం ఫ్యూచర్ సిటీ మాటున రియల్ ఎస్టేట్ దందా

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.సిద్దాపూర్ కు తెస్తున్న చెత్త డంప్ యార్డ్ ప్రతిపాధన ను రద్దు చేయాలి... సబితా ఇంద్రా రెడ్డి.




షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి జూన్ 01 : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న చెత్త డంప్ యార్డు ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈరోజు సిద్దాపూర్ గ్రామం నుండి కలెక్టరేట్ వరకు చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ షాద్ నగర్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు భారీగా పాదయాత్రతో బయలుదేరారు. చలో కలెక్టరేట్ పాదయాత్రకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.... బి ఆర్ ఎస్ హయాం లో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందాలు నడిపిస్తుందన్నారు. ఏ భూముల్లో ఏ పరిశ్రమలు నెలకొల్పాలో ఏ భూముల్లో చెత్త డంప్ యార్డులు తీసుకురావాలో సీఎం రేవంత్ రెడ్డి కి కనీస అవగాహన లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దాపూర్ ప్రాంతంలో ఐటీ పార్కు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం సేకరించిన 350 ఎకరాల భూమిలో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చెత్త డంప్ యార్డ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ చెత్త డంప్ యార్డ్ వల్ల చుట్టుపక్కలోని గ్రామాలకు ప్రజలకు పశువులకు అనేక సమస్యలు తలెత్తుతాయని, పర్యావరణ కాలుష్యంతో పాటు పరిసరాలు దెబ్బతింటాయని, వెంటనే డంప్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



మంథని/రామగుండం, జూన్-01,నేటి శుభోదయ: పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని బసంత్ నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, రామారావుపల్లి, గోలివాడ గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో సోమవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలుతెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో అనేక కుటుంబాలు శాశ్వత నివాస సౌకర్యాన్ని పొందుతున్నాయని, భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శార్ (స్పెక్సిలింటేసివే ప్రోగ్రాం)అమలు విధానం విస్తృతంగా ప్రచారం కోసం చర్చా

గోల్కొండ జిల్లా ఇన్చార్జ్ వై.శ్రీధర్.



రాజేంద్రనగర్, జూన్ 01 (నేటి శుభోదయ) : శార్ (స్పెక్సిలింటేసివే ప్రోగ్రాం)అమలు విధానం విస్తృతంగా ప్రచారం కోసం చర్చించడం జరిగిందని గోల్కొండ జిల్లా ఇన్చార్జ్ వై.శ్రీధర్ తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధి ప్రజాభవన్, శివరాంపల్లిలో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకుల సమావేశం విజయవంతంగా నిర్వహించారు.ఈ సమావేశంలో శార్ (స్పెక్సిలింటేసివే ప్రోగ్రాం) అమలు విధానం,రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించబడింది.సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర,జిల్లా,మండల స్థాయి నాయకులు కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి కీలక సూచనలు చేశారు.ముఖ్యంగా సర్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు సమర్థవంతంగా తీసుకెళ్లాలని,పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే,జూన్ 2న జరగబోయే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుదినోత్సవ కార్యక్రమాల నిర్వహణపై కూడా చర్చించి,జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో గోల్కొండ జిల్లా ఇన్చార్జ్ వై.శ్రీధర్,ఆర్ఆర్ జిల్లా కార్యదర్శి పి.మల్లేష్,కె.సోల్కర్ రెడ్డి (సర్),జోగు రవి,సదానంద్,హరికిషన్ జీ,బండారి బాలకృష్ణ,సమ రాహుల్ రెడ్డి,రాజేంద్రనగర్ జనరల్ సెక్రటరీ ఎస్.రాజశేఖర్ రెడ్డి,పద్మావతి,కవిత తదితరులు పాల్గొన్నారు.

# నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం లఐటీ నిర్మాణానికి భూములను కేటాయిస్తే

నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూముల్లో చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది...

ఇదే నా మార్పు అంటే ఇదేనా ప్రజాపాలన అంటే

సిద్ధాపూర్ భూముల్లో చెత్త డంప్ యాడ్ నిర్మాణ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

ఇక్కడి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించలేరు

సిద్ధాపూర్ గ్రామంలో చేపట్టిన పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించిన సబితా ఇంద్రారెడ్డి.చెత్త డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా నిర్వహించిన చలో కలెక్టరేట్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్.పాల్గొన్న డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ




షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి జూన్ 01 : షాద్నగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు మండలంలో సిద్దాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని చెత్త డంపింగ్ యార్డ్ నిర్మాణ నిర్ణయం పై స్థానిక ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం అవుతాయని బాధిత గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగానే చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్,డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని తలపెట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై సిద్దాపూర్ గ్రామంలో గులాబీ శ్రేణులు తలపెట్టిన పాదయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛమైన వాతావరణము ఉంటుందని,ఈ ప్రాంతానికి ఉపాధి వనరులను చూపాలే తప్పా,రోగాలను సృష్టించే చెత్త డంపింగ్ యార్డ్ ను తీసుకురావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పారిశ్రామిక రంగ అభివృద్ధికి కేటాయించిన ఈ భూముల్లో చెత్త డంపు యార్డ్ ను ఎలా ఏర్పాటు చేస్తారని మండిపడ్డారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధి కోసం,ఈ ప్రాంత యువత కోసం ప్రభుత్వ సిద్దాపూర్ భూముల్లో ఐటీ టవర్లను ఏర్పాటు చేయడంతో పాటు,టమాటో ప్రాసెసింగ్ యూనిట్ ను నెలకొల్పేందుకు నిర్ణయం తీసుకుంటే,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విరుద్ధంగా విలువైన భూముల్లో చెత్త డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేయడం దేనికి నిదర్శనం అని ఆవేదన వ్యక్తం చేశారు.మార్పు అంటే ఇదేనా, ప్రజా పాలన అంటే ఇదేనా,పచ్చని పల్లెలను మురికి కుపంగా మారుస్తారా రోగాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుపుతారా ? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని,ప్రజల పక్షాన పోరాటం చేస్తూ పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తామని హెచ్చరించారు.ప్రాంత ప్రజల అవసరాల కోసం,యువత ఉపాధి కోసం ఐటీ టవర్లతోపాటు, కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఏ నిర్ణయాన్ని కూడా స్వీకరించేది లేదని,ప్రజల పక్షాన పోరాట, ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.వేలాది మంది కార్యకర్తలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చెత్త డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణ రెడ్డి, రవీందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎస్సి ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు రాంబాల్ నాయక్,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ,మాజీ జడ్పీటీసీ శ్రీలత,మాజీ మున్సిపల్ చైర్మన్లు నరేందర్,లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ పార్టీ అధ్యక్షులు మెండే కృష్ణ, పద్మా రెడ్డి,మురళీధర్ రెడ్డి,కోస్గి శ్రీనివాస్, హఫీజ్,లక్ష్మణ్ నాయక్, సిద్దాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తులసమ్మ బాలయ్య,మహిళ నాయకురాలు రాజ్యలక్ష్మి, నాయకులు మిట్టు నాయక్,జగన్మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి,గోపాల్ నాయక్,వేణుగోపాల్,పెంటనోళ్ళ యాదగిరి, కడాల శ్రీశైలం,బ్యాగరీ రాజు దేశాల జైపాల్,లక్ష్మీ నరసింహా రెడ్డి,నరసింహా రెడ్డి, విఠల్,శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మినారాయణ గౌడ్,రాములు,వెంకట్ నారాయణ రెడ్డి, స్థానిక సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# తుమ్మల ముందుచూపుతో పచ్చిరొట్ట సాగుకు ఊతం

- తొలకరి ముందే రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ
- భూసార పరిరక్షణే లక్ష్యంగా వ్యవసాయ శాఖ చర్యలు
- యూరియా అధిక వినియోగంతో నేల సారం క్షీణిస్తోందని హెచ్చరిక
- పచ్చిరొట్ట పంటల సాగుతో సేంద్రియ శక్తి పెంపు
- వీవీపాలెం పీఏసీఎస్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం
- భూసార పరిరక్షణకు తుమ్మల ప్రత్యేక దృష్టి



ఖమ్మం, నేటి శుభోదయ ::: వ్యవసాయ భూముల సారాన్ని కాపాడేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు భూముల ఉత్పాదకత దీర్ఘకాలం కొనసాగాలనే లక్ష్యంతో పలు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా తొలకరి వర్షాలకు ముందే పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్స హిస్తున్నారు. భూసారాన్ని పెంచే జీలుగు, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలను రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట సాగు ఎంతో అవసరమని మంత్రి పదేపదే సూచిస్తున్నారు. రైతులు రసాయన ఎరువులపై ఆధార పడకుండా సహజ పద్ధతులను అనుసరించాలని పిలుపునిస్తున్నారు.

## - వీవీపాలెం పీఏసీఎస్‌లో విత్తనాల పంపిణీ

ఖమ్మం అర్బన్ పరిధిలోని వీవీపాలెం పీఏసీఎస్ కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు రైతులకు విత్తనాలను అందజేశారు. భూసార పరిరక్షణలో పచ్చిరొట్ట పంటల పాత్రను వివరించారు. రైతులు విస్తృతంగా ఈ పంటలను సాగు చేసి భూముల సేంద్రియ శక్తిని పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతుల నుంచి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.

- యూరియా అధిక వాడకంతో భూసారానికి ముప్పు

వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ యూరియా ఇతర రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. సూక్ష్మపోషకాల లోపం కారణంగా భూముల ఉత్పాదకత క్రమంగా క్షీణించే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పచ్చిరొట్ట పంటల సాగు ఉత్తమ మార్గమని వివరించారు. జనుము, పిల్లిపెసర, జీలుగు వంటి పంటలను పుష్పించే దశలో భూమిలో కలపడం ద్వారా నేల సారం పెరుగుతుందని చెప్పారు. భూమిలో జీవక్రియలు మెరుగుపడి పంటలకు అవసరమైన పోషకాలు లభిస్తాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## - రైతులకు అవగాహన, పచ్చిరొట్ట సాగుపై ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమంతో పాటు భూసార పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందుచూపుతోనే వర్షాకాలం ప్రారంభానికి ముందే విత్తనాల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే పచ్చిరొట్ట పంటల సాగు తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, ఎంఏఓ బి. కిషోర్‌బాబు, ఏఈఓ బాలబత్తుల సాయి శిరణమ్మయి, పీఏసీఎస్ సీఈఓ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం అర్బన్ ప్రాంతానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విత్తనాలను స్వీకరించారు. పచ్చిరొట్ట సాగును గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు



(నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి )మండల పరిధిలోని చిన్న వాల్గోట్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గణేష్, ఉప సర్పంచ్ గోవర్ధన్ ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మండలం లోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ గృహ ప్రవేశ లు జరిగినాయి చిన్నవాల్గోట్ గ్రామంలో ప్రాథమికంగా రెండు ఇళ్లకు గృహప్రవేశాలు చేయించామని, ప్రస్తుతం మరో 41 ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామానికి మొత్తం 108 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డికి లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# 18 కిలోల గంజాయిని పట్టించిన ప్రైవేట్ బస్ ట్రావెల్స్ కండక్టర్

సన్మానించిన కుకట్ పల్లి డి సి పి రితిరాజ్ ..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :30-05-2026 నాడు రాత్రి సుమారు 8:00 గంటల సమయమున ఆరుగురు వ్యక్తులు హైదరాబాద్ లోని మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద నుండి ఔరంగాబాద్ కు వెళ్ళుట గురించి షిర్డీకి వెళ్ళుచున్న బస్ లో లగేజి బ్యాగ్ పెట్టుచుండగా బస్ కండక్టర్ కు అనుమానం వచ్చి ఆ బ్యాగ్ లో ఉన్న వస్తువుల గురించి విచారించగా ఆ వ్యక్తులు సరైన సమాధానం చెప్పకుండా అనుమాన స్పదంగా అక్కడి నుండి పారిపోయినారు. అట్టి లగేజి బ్యాగ్ ను కండక్టర్ మియాపూర్ పోలిస్ స్టేషన్ కు తీసుకు వచ్చి ఈ విషయం తెలియపరచగా పోలిస్ వారు పంచుల సమక్షములో పంచనామా నిర్వహించి స్వాధీన చేసుకొని తూకం వేయగా గంజాయి సుమారు 18 కిలోలు గా ఉన్నది. ఇట్టి దాని విలువ మార్కెట్ లో సుమారు 20 లక్షల వరకు ఉంటుంది. ఈ విషయములో మియాపూర్ పోలిస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇట్టి గంజాయిని రవాణ చేస్తున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొనుట గురించి ప్రత్యేక దళాలను ఏర్పాటు చేయనైనది. గంజాయిని పట్టించిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్ కండక్టర్ ను కుకట్ పల్లి డి సి పి రితిరాజ్ శాలువా కప్పి సన్మానించి నగదు ప్రోత్సాహం అందించినారు.



# డ్రైనేజీ లీకేజీ సమస్య పరిష్కారం కోసం ప్రజావాణి లో పిర్యాదు..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి సాయి కాలనీ, కేశవ్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్ కొండాపూర్ హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ ప్రజావాణిలో శేరిలింగంపల్లి డీజీఎం కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాగం హరి శంకర్ యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజీ లీకేజీల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇదే సమస్యపై గతంలో కూడా పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.వినతిపత్రానికి స్పందించిన శేరిలింగంపల్లి డీ జీ ఎం సంబంధిత మేనేజర్‌ను వెంటనే ప్రాంతాన్ని సందర్శించి సమస్యను పరిశీలించాలని ఆదేశించారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భీమ్‌రాజ్, రవికుమార్, సాయిరామ్, అరుణ్, నరేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

**- ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం13నెలల్లో లక్ష ఇళ్లు పూర్తి- మరో రెండు నెలల్లో మరో రెండు లక్షలు పూర్తి చేస్తాం**




హైదరాబాద్, నేటి శుభోదయ ::: ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను నెరవేర్చడానికి ఉచితంగా ఐదు లక్షల రూపాయిలతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేశామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కొరారి గ్రామంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం చుట్టారు. అలాగే కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుంచి 6,500 ఇళ్లను మంజూరు చేసినట్లు అవుతుందన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజక వర్గాలకు అదనంగా 500 నుంచి 1500 వరకు మంజూరు చేశామని తెలిపారు. తాము ఆశించిన స్థాయిలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతమైందని గత ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని, ఈ 13 నెలల్లో లక్ష ఇళ్లను పూర్తి చేసుకొని మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇది ఏరకంగా చూసినా దేశానికే ఆదర్శవంతంగా ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు.

ఈ ఏడాది 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లకు రాష్టం లోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక ప్రణాళికా బద్దంగా మొదటి విడతలో ఎదురైన మంచి చెడులను పరిగణనలో తీసుకొని మరింత పటిష్టంగా రెండోవిడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతోనే గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పేదవాడి ఇల్లు -- ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం కేవలం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరై, ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి, 2023 లో గృహ లక్ష్మి పథకంలో ఇండ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి చేసుకోలేకపోయిన వారికి రెండవ విడతలో ఆ ఇంటి నిర్మాణం పూర్తి అవడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ పథకంలో 20వేల రూపాయిల వరకు ఆర్థికసాయం పొందినవారికి కూడా ఈ విడతలో ఇండ్ల మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్‌లలో ఉద్యోగాలు సాధించిన ప్రియదర్శిని విద్యార్థినులు




ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిష్టాత్మక ఐటీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు.కళాశాలకు చెందిన విద్యార్థినులు గణేష్ లహరి, వి. పవిత్ర ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాలో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ హోదాలకు వార్షిక రూ.6 లక్షల వేతన ప్యాకేజీతో ఎంపికయ్యారు. అదేవిధంగా కె. నర్మద కాగ్నిజెంట్ సంస్థలో టెక్ సపోర్ట్ ఇంజనీర్గా వార్షిక రూ.5 లక్షల వేతనంతో ఉద్యోగాన్ని సాధించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే నైపుణ్యాలతో తీర్చిదిద్దేందుకు కళాశాల ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థినుల ఈ విజయం వారి కృషికి, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్ మాట్లాడుతూ టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థల్లో విద్యార్థినులు ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థినుల క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో పాటు అధ్యాపకుల సమర్థవంతమైన మార్గదర్శకత్వం ఈ విజయానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, కెరీర్ మార్గదర్శకత్వాన్ని అందించడం వల్లే విద్యార్థినులు అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ విద్య అనేది కేవలం ఉపాధి సాధనకు మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక బాధ్యత పెంపొందించడానికి మరియు దేశాభివృద్ధికి దోహదపడే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పష్టమైన లక్ష్యాలు, క్రమశిక్షణతో కూడిన కృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ విద్యార్థి అయినా ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ అవకాశాలు సాధించిన విద్యార్థినులను కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మన్మోహన్ తివారి అభినందిస్తూ, వారి భవిష్యత్ కార్యజీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మానవత్వానికి నిదర్శనం

**- హర్యాతండా గ్రామ ప్రజాప్రతినిధుల సేవాభావం**





ఖమ్మం, నేటి శుభోదయ ::: రఘునాథపాలెం మండలం హర్యాతండా గ్రామంలో సోమవారం మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని, ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ స్వాతి, ఉప సర్పంచ్ బానోత్ శ్రీనునాయక్ తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ బానోత్ శ్రీనునాయక్ తన సొంత ఖర్చులతో సుమారు 250 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి, ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించారు. కూలీలు వారి సేవా దృక్పథాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బోడా రాము, 1వ వార్డు సభ్యుడు వాంకుడోతు చందర్, 5వ వార్డు సభ్యుడు బానోత్ కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీరా శ్రీను, గ్రామ పెద్దలు, యువత, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ముందుండి సేవలందిస్తున్న ఉపసర్పంచ్ బానోత్ శ్రీనునాయక్ సేవాభావాన్ని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా సేవే పరమావధిగా భావించి నిరంతరం ప్రజల కోసం కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు ఉపాధి కూలీలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఆలిండియా ర్యాంకు సాధించిన కిలారు పన్విక్ చౌదరి



ఖమ్మం, నేటి శుభోదయ ::: 2026 ఐఐటీ లలో సీట్ల కొసం రుజరిగిన జే ఈ ఈ అడ్వాన్స్డ్ పరీక్ష లో ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థి కిలారు పన్విక్ చౌదరి జనరల్ కేటగిరీ లో అల్ ఇండియా 147 వ ర్యాంకు, సాధించాడు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కాలేజీ లో ఇంటర్ పూర్తి చేశాడు. జే ఈ ఈ మెయిన్స్ లోనూ ఆల్ ఇండియా 1251, టీజీ ఎప్ సెట్ లో 14 వ ర్యాంక్ సాధించాడు. తల్లి స్వాతి ఎస్బీఐ బ్యాంకు ఉద్యోగి , తండ్రి నాగేశ్వరరావు ప్రైవేట్ ఉద్యోగిగా ఖమ్మంలో పని చేస్తున్నారు. కిలారు పన్విక్ ఎల్ కే జి నుంచి 5 వ తరగతి వరకు ఖమ్మంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల లో చదివాడు.భవిష్యత్తులో కంప్యూటర్ ఇంజనీర్ గా పెద్ద కంపెనీ లో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యం అని చెప్పారు.ఈ సందర్భంగా పన్విక్ కి స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరెస్పాండంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య అభినందించి,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి ఆకాంక్షించారు.స్మార్ట్ కిడ్జ్ ఒత్తిడిలేని విద్యా విధానంతోనే చిన్నారులు అనేక విజయాలు సాధిస్తున్నారని అన్నారు.

## ఈటల రాజేందర్‌పై దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం

**: బిజెపి నాయకుడు ముకుంద నాగేశ్వర్**



వికారాబాద్ జూన్ 1నేటి శుభోదయ్యా:తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకుల్లో ఒకరైన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్దేశపూర్వకంగా అపఖ్యాతి పాలుచేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని భారతీయ జనతా పార్టీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నాయకుడిగా, ఎమ్మెల్యేగా, శాసనసభలో తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన ప్రతిపక్ష నేతగా, రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన నాయకుడిగా, మంత్రిగా, ప్రస్తుతం ఎంపీగా ప్రజలకు సేవలందిస్తున్న ఈటల రాజేందర్‌పై దుష్ప్రచారం చేయడం మేలిమి బంగారానికి బురద అంటించడంలాంటిదని పేర్కొన్నారు. ఎంత బురద చల్లినా బంగారం విలువ తగ్గదని అన్నారు.తెలంగాణలో బలమైన వెనుకబడిన వర్గాల నాయకుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ ఎదుగుదలను చూసి ఓర్వలేక, భవిష్యత్తులో ఆయనకు లభించే అవకాశాలను అడ్డుకోవాలనే సంకుచిత ఆలోచనతో కొందరు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తున్న నాయకుడిపై అసత్య ప్రచారాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉన్న నాయకుడిగా ఈటల రాజేందర్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశం ఉందని, అందుకే కొందరు కావాలనే అపప్రథ కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులపై ఆధారరహిత ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముకుంద నాగేశ్వర్ కోరారు.

## ధన్నారంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు





వికారాబాద్ జూన్ 1నేటి శుభోదయ:వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు ధన్నారంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో బోరు ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయి చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక కౌన్సిలర్ ఎరుకలి సుధాకర్ సమక్షంలో ధన్నారం గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎల్లమ్మ తల్లి ఆలయం సమీపంలో ఈ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుచిత సాయి చరణ్ రెడ్డి, యాస్కి శిరీష, లావణ్య సురేందర్, స్రవంతి శ్యామ్ రెడ్డి, అమర్నాథ్, వెంకట్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న బోరు ద్వారా ధన్నారం ప్రాంత ప్రజలకు తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ**



నేటి సుబోధయ, :సంగారెడ్డి ప్రతినిధి :ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు.. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ చేస్తూ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# నేరాలకు దూరంగా ఉండాలి...

**రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక.**




హనుమకొండ జిల్లా ప్రతినిధి (మౌళి) , (జూన్ 1); రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పేరు కలిగి ఉండాలని హసన్ పర్తి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేందర్ అన్నారు.హనుమకొండ జిల్లా హసన్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సోమవారం నాడు స్థానిక సీఐ మహేందర్ కౌన్సిలింగ్ చేసి హెచ్చరించారు.పదేళ్ల పాటు సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేస్తామని ఆయన తెలిపారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిరంతర నిగా ఉంటుందన్నారు.నేర ప్రవృత్తి విడనాడితే పిల్లల చదువులకు, ప్రభుత్వ పథకాలకు పోలీసుల పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కౌన్సిలింగ్లో పాల్గొన్న రౌడీ షీటర్లు ఇకపై నేరాలకు పాల్పడబోమని పోలీసుల ఎదుట 18 మంది రౌడీషీటర్ల హామీ ఇచ్చారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి.

**-- జిల్లా కలెక్టర్ అంకిత్.**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 01 (నేటి శుభోదయ),ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు . ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక




99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాల ను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జూన్ 1 నుండి 12 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేలా ఉండాలని, ప్రతి గ్రామం, విద్యాసంస్థలు , ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు.అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు తమ తమ పరిధిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 55 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 శాతానికి పైగా అటవీ విస్తీర్ణం ఉందని, అన్ని శాఖల సమన్వయం తో గత రెండు సంవత్సరాలుగా ఒక్క ఎకరం పోడు భూమి కూడా నరికివేయకుండా సంరక్షించగలిగామని తెలిపారు. జిల్లాలో పామాయిల్, జామాయిల్, వెదురు తదితర పంటల సాగు విస్తరించడంతో జిల్లా పచ్చదనంతో కళకళలాడుతోందని, రాష్ట్రంలో పచ్చదన పరిరక్షణలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతకు ఉపయోగపడే సేఫ్టీ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.సమావేశంలో అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.